J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 42 21.03.2025, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




## జగన్‌తో సమరానికి..

# సై అంటున్న సాయిరెడ్డి



> ఒక్కొక్కటిగా గుట్టు విప్పుతున్న ఏ-2 > బొక్కలు బయటపెడుతున్న లెక్కల మాంత్రికుడు

*"కాలం కలసి రాకపోతే.. తాడే పామై కరుస్తుంది" అన్నది మన పెద్దలు చెప్పిన సామెత. అలాగే టైం బాగా లేకపోతే .."తన మిత్రులే తన శత్రువులవు తారు" అన్నది కూడా అంతే నిజం. తామరపువ్వు బురదలో ఉంటే.. సూర్యకాంతి సోకి వికసిస్తుంది, దాన్ని పీకేసి గట్టున పడేస్తే.. అదే సూర్యకాంతి దాన్ని వాడి పోయేలా చేస్తుంది.*

మనుషుల్లోనూ బంధాలు ఇదే తరహాలో ఉంటాయని అనడానికి ఆంధ్రా ఏ-1 జగన్, ఏ-2 సాయిరెడ్డి వ్యవహారమే తాజా ఉదాహరణ. ఆడిటర్‌గా జగన్ కుటుంబంలోని మూడు తరాల వారితో సంబంధాలు నెరిపి, జగన్ కార్యకలాపాలపై ఆమూలాగ్రం అవగాహన పెంచుకున్న మాజీ ఎంపీ విజయ సాయిరెడ్డి, తన మాజీ అధినేతపై పొలిటికల్ బాంబ్ విసిరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. అంతర్గత శత్రువులతో పోరాడి ఓడి, చివరికి మనసు విరిగి పార్టీకి టాటా చెప్పిన తర్వాత వ్యవసాయం చేసుకుంటానంటూ గతంలో చెప్పిన విజయసాయి, తాజాగా గత ప్రభుత్వంలో చోటు చేసుకున్న

11లో




## • రాజకీయ రాద్ధాంతం

# భాషపై స్టాలిన్ పంతం



సంకుచిత విధానాలతో.. ప్రాంతీయ భాషా విధానాన్ని అమలు చేస్తున్న చాలా దేశాలు అభివృద్ధిలో అట్టడుగున ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. ప్రస్తుతం ఏ రంగంలో అయినా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ఇంగ్లీష్, జాతీయస్థాయిలో రాణించాలంటే హిందీ తప్పనిసరి

2లో



కీ॥శే॥ పత్తి రవీంద్రబాబు గారు
అధినేత : సాయినాథన్ & కంపెనీ, ట్రంకురోడ్డు, నెల్లూరు
మాజీ చైర్మెన్ : శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానము, నెల్లూరు
మాజీ మెంబర్ : కొచ్చిన్ పోర్టు, కొచ్చిన్
మాజీ మెంబర్ : గోవా పోర్టు, గోవా
జననం : 20.07.1949 మరణం : 08.03.2025

## ఉత్తరక్రియలు

శత్రుత్వానికి అర్థం తెలియని మంచి మనిషి
సేవే పరమావధిగా జీవించిన మహామనీషి
ఆధ్యాత్మిక సేవాతత్పరుడు, వ్యాపార దక్షుడు
స్నేహదీప్తి, ఆత్మీయమూర్తి, మా కుటుంబ కీర్తి, మాకు స్ఫూర్తి

**శ్రీ పత్తి రవీంద్రబాబు గారు**

తేది. 08.03.2025న స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య : పత్తి రాజదుర్గ
కుమారుడు - కోడలు
పత్తి సీతారాంబాబు - సింధూరి
మనుమరాలు : పత్తి రియా సంతోషి (London)
కుమార్తె - అల్లుడు
శ్రీ మహాలక్ష్మి - అంబటి కిరణ్‌కుమార్ (Canada)
మనుమడు : అంబటి లిఖిత్ సంతోష్ (Canada)
మరియు కుటుంబసభ్యులు

**ఉత్తరక్రియలు:**
వారి 'పెద్దకర్మ' తేది. 24.03.2025
సోమవారం నెల్లూరు, కె.వి.ఆర్.పెట్రోల్ బంకు సెంటర్, శాంతి అపార్ట్‌మెంట్‌లోని మా స్వగృహము నందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

## కమనీయం.. రమణీయం..

# ప్రసన్నుడి కళ్యాణం

### ○ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం



జిల్లాలో ఎంతో ప్రాచీనమైనదిగా ప్రసిద్ధిచెందిన వేంకటేశ్వరుని దేవాలయం.. నారదమహర్షిచే నిర్మితమైన బిలకూట క్షేత్రం.. బోగోలు మండలం కొండబిట్రగుంటలో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో ఇటీవల బ్రహ్మోత్సవాలు కనువిందుగా జరిగాయి. వేలాదిమంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. గోవింద నామస్మరణలతో కొండ బిట్రగుంట మార్మోగింది. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంగరంగ వైభవంగా జరిగిన కల్యాణోత్సవం భక్తులందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తరపున రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర స్వామివారికి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలతో వారిని ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ దేవాదాయ శాఖ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కొండ బిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం, బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అదృష్టమని, పూర్వజన్మ సుకృతమని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం, ఈవో కార్యాలయం, విశ్రాంతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. తిరుమల తరువాత దక్షిణాదిన బిట్రగుంట క్షేత్రం అత్యంత ప్రసిద్ధి చెందినదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, ఇఓ అరవ రాధాకృష్ణ, దేవాదాయ శాఖ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్డిపాళెం నీటికష్టాలు తీర్చిన..ప్రశాంతమ్మ



కోవూరు నియోజకవర్గం..కొడవలూరు మండలంలోని పాతవంగల్లు పంచాయతీకి చెందిన వడ్డిపాళెం గ్రామంలో ప్రజలు ఏటా వేసవిలో నీటి ఎద్దడితో కష్టాలు పడుతుండేవారు. డ్రైనేజీ పైపులు, తాగునీటి పైపులు ఒకే ప్రాంతం నుంచి వెళ్లడంతో తాగునీటి పైపులు దెబ్బతినిపోయి మంచినీరు-డ్రైనేజీ నీరు కలగలిసి కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో గ్రామస్తులు ఆ నీటిని తాగలేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను తెలుసుకున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ వెంటనే స్పందించి, గ్రామస్తులకు ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పరిశుభ్రమైన నీరందించాలని అధికారులను ఆదేశించారు. ప్రశాంతమ్మ ఆదేశాలతో వెంటనే అధికారులు రంగంలోకి దిగి డ్రైనేజీ నీళ్ళు వెళ్లేందుకు ప్రత్యేక పైపులు ఏర్పాటు చేశారు. తాగునీటి పైపులకు చకచకా మరమ్మతులు చేయించి, కలుషితం లేని మంచినీళ్లు గ్రామస్తులకు అందేలా చర్యలు తీసుకున్నారు. దాంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

# భాషపై స్టాలిన్ పంతం

(మొదటిపేజీ తరువాయి)

అన్న పరిస్థితి నెలకొంది. దేశంలో నిరుద్యోగం పెరగడానికి ప్రధానంగా సాంకేతికత, భాషా నైపుణ్యాలు లేకపోవడమే కారణమని పలు నివేదికల్లో వెల్లడైంది. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాల్లోకి భాషలను కూడా తీసుకొస్తుండడం, మరికొందరైతే ఏకంగా తమ రాష్ట్రాల్లోకే అనుమతించబోమంటూ అగ్గిరాజేసే ప్రయత్నం చేస్తుండడం శోచనీయం. ఫలితంగా సగటు భారతీయ విద్యార్థి ప్రపంచస్థాయి పోటీలో మరింత వెనుకబడేట్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమిళనాడులోకి హిందీని అనుమతించబోమంటూ డీఎంకే ప్రభుత్వం వితండవాదంపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఇటీవల జనసేనాని పవన్ కల్యాణ్ కూడా తీవ్రంగానే స్పందించారు. జాతీయస్థాయిలో కేంద్రం ఆమోదించిన రుపీ సింబల్‌ను డీఎంకే ప్రభుత్వం మార్చడం తగదని హితవు పలికారు. స్టాలిన్ చర్యలవల్ల చివరకు తమిళ విద్యార్థులకే నష్టం వాటిల్లే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో దక్షిణభారతదేశ ప్రజా ప్రతినిధులతో ఈనెల 22న చెన్నైలో తలపెట్టిన అఖిల పక్ష సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కాదేదీ కవితకనర్హం.. అంటూ శ్రీశ్రీ అభిప్రాయపడితే, కాదేదీ రాజకీయ రాద్ధాంతానికి అనర్హం అంటూ నేటి తరం నాయకులు నిరూపిస్తున్నారు. నిన్నటివరకు కులం, మతం, వర్గం, వర్ణం, ప్రాంతీయ భేదాల పేరిట రాజకీయాలు చేసిన నాయకులు ప్రస్తుతం తల్లిలాంటి భాషలను సైతం ఆ రొంపిలోకి లాగుతున్నారు. నిజానికి సమాజంలో ఒకరి భావాలను ఇంకొకరు తెలుసుకునేందుకు ఏర్పడిన ధ్వని సంకేతాల నియత నిర్మాణం భాష. సమాచార వ్యాప్తికైనా, మనోభావాల వెల్లడికైనా భాష ఎంతో ప్రధానం. ఇంతటి ప్రాధాన్యం ఉన్న భాష ప్రస్తుతం భారతదేశ రాజకీయాల్లో వివాదాలకు కేంద్రబిందువవుతోంది. 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (త్రిభాషా సూత్రం)ని తమిళనాడులో అమలు చేయబోమని స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం తేల్చిచెప్పింది. దీంతో కేంద్ర మానవ వనరుల శాఖ నుంచి విడుదల కావాల్సిన వేలాదికోట్ల రూపాయల నిధుల విడుదల అర్ధాంతరంగా ఆగిపోయింది. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపింది. తమిళనాడు నాయకులు కేంద్రం తీరుపై అగ్గిమీద గుగ్గిలమయ్యారు. తీరు మార్చుకోకుంటే తగిన గుణపాఠం చెబుతామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### జాతీయ విధానం కాదు.. బీజేపీ విధానం!

నిజానికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూతన విద్యావిధానం మేరకు తమిళనాడు ప్రభుత్వానికి కేంద్ర మానవ వనరుల శాఖ నుంచి రూ.2500 కోట్ల వరకు నిధులు విడుదల కావాల్సి ఉంది. అయితే కేంద్రం ప్రకటించిన త్రిభాషా సూత్రాన్ని అమలు చేయనందున ఆ మొత్తం విడుదల చేయడం లేదని ఆ శాఖ మంత్రి ధరేంద్రప్రధాన్ పార్లమెంట్‌లో వెల్లడించారు. దీనిపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్రంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది తమపై చూపే వివక్షే అని.. ఇప్పటికే సాంస్కృతిక పరమైన వేడుకల్లో ఉత్తరాది సంప్రదాయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని, పండగల్లో ఉత్తరాది ఆచారాలనే హైలైట్ చేస్తున్నరని ఆరోపించారు. ఆర్థిక కేటాయింపుల్లో ఉత్తరాది రాష్ట్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శలు గుప్పించారు. త్వరలో పునర్ వ్యవస్థీకరణ పేరుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని పార్లమెంట్‌లో తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి సమయంలో త్రిభాషా సూత్రం పేరిట నాగపూర్ ఆదేశాలను (ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను) తమిళనాడులో అమలు చేసి హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం సమంజసం కాదని, ఇప్పటికైనా తీరుమార్చుకోకుంటే 1968 తరహాలో మరో హిందీ వ్యతిరేక ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇక కేంద్ర ఇవ్వాల్సిన రెండువేల కోట్లే కాదు, దానికి మరో 8 వేల కోట్లను కలిపి మొత్తం రూ.10 వేల కోట్లిచ్చినా త్రిభాషా విధానాన్ని తమిళనాడులో అమలు చేయబోమని పంతం పట్టారు.

### డీలిమిటేషన్‌పై సమీక్షలో ప్రత్యేక చర్చ?

2026లో కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్న నేపథ్యంలో చెన్నైలో ఈనెల 22వ తేదీన దక్షిణాది రాష్ట్రాల ప్రధాన పార్టీల నాయకులతో స్టాలిన్ సమావేశం కాబోతున్నారు. వారితో పాటు విపక్ష పార్టీల ముఖ్యమంత్రులున్న పశ్చిమ బెంగాల్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్ వంటి రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి అందులో డీలిమిటేషన్‌లో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకుండా చూడాలని తీర్మానం చేయనున్నారు. అదే సమయంలో జాతీయ విద్యావిధానంపై కూడా చర్చించే అవకాశం కనిపిస్తోంది.

### తమిళనాడు విద్యార్థుల భవిష్యత్‌పై నీలినీడలు?

గతంలో ప్రపంచంతో ఎలాంటి వ్యాపార, వాణిజ్య, సాంస్కృతిక సంబంధాలు లేకుండా ఐసోలేషన్ విధానం అవలంభించిన చైనా, తర్వాతి కాలంలో అనేక ఆవిష్కరణలు చేసినా, అభివృద్ధిలో మాత్రం వెనుకబడిపోయింది. దీనికి కారణం ప్రపంచ జనాభాతో భాష, నాగరిక సంబంధాలు లేకపోవడమే. ఆలస్యంగా ఆ విషయాన్ని గుర్తించిన అక్కడి పాలకులు అన్ని భాషలను విద్యార్థులు తెలుసుకోవాలని, ప్రపంచ మార్కెట్లను చైనా వస్తువులు ముంచెత్తాలనే ధ్యేయంతో విద్యా, వ్యాపార రంగాల్లో గణనీయమైన సంస్కరణలు తీసుకొచ్చి అభివృద్ధిలో కొత్త శిఖరాలను అందుకుంటున్నారు. అయితే మన దేశంలో రాజ్యాంగం ఆమోదించిన భాషలను సైతం తమ రాష్ట్రాల్లో అమలు చేయబోమంటూ కొందరు నాయకులు సంకుచిక భావంతో, అర్థంపర్థంలేని విధానాలతో ముందుకు సాగడం అత్యంత శోచనీయమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిపోయిన నేటి తరుణంలో భాషా బేధాలు, ప్రాంతీయ విబేధాల వల్ల అభివృద్ధి కుంటుబడడమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని అభిప్రాయపడుతున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా, దేశంలో అత్యధికులు మాట్లాడే భాష హిందీ. దాన్ని నేర్చుకోవడం వల్ల విద్యావకాశాలతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పన వంటివి పెరుగుతాయన్నది నిర్వివాదాంశం. హిందీ పేరుతో బీజేపీ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను తమిళనాడులోకి చొప్పిస్తుందనో, తమిళులు హిందీ భాషను అర్థం చేసుకుంటే రాజకీయంగా తమ ఉనికికి ప్రమాదమనో తమిళ రాజకీయ పార్టీల నేతలు భావించడం అర్థరహితమైన వాదన అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తమిళ పార్టీల మొండి వైఖరి వల్ల చివరికి అభం శుభం తెలియని తమిళనాడు యువత భవిష్యత్‌కు తీవ్ర విఘాతం కలుగుతుందని, వారు ప్రపంచంతో పోటీపడే విద్యను, ఆర్థిక స్థిరత్వాన్ని పొందలేరని, అవకాశాలను అందిపుచ్చుకోలేరని అభిప్రాయపడుతున్నారు.

### దక్షిణాది దిగ్గజాలను చూసైనా స్ఫూర్తి పొందరా.?

దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ఎందరో దిగ్గజాలు దేశ స్వాతంత్ర్యంతో పాటు సమాజంలోని మూఢ విశ్వాసాలు, తప్పుడు విధానాలపై అలుపెరగని పోరాటం చేశారు. జాతీయ స్థాయిలో తమ సత్తాను చూపించి ఆదర్శంగా నిలిచారు. వారిలో తమిళనాడుకు చెందిన సి.రాజగోపాలాచారి స్వాతంత్ర్య సంగ్రామంలో కాంగ్రెస్ తరపున పాల్గొంటూనే మాతృభాష తమిళంతో పాటు ఆంగ్లం, హిందీ భాషలపై పట్టుపెంచుకుని గాంధీ, నెహ్రూ వంటి దిగ్గజ జాతీయ నాయకులతో సత్సంబంధాలు నెలకొలిపి దేశానికి తొలి, చివరి గవర్నర్ జనరల్‌గా పనిచేసిన ఘనతను దక్కించుకున్నారు. తర్వాత కాలంలో దేశంలో తొలి భారత రత్న పొందిన గౌరవాన్ని దక్కించుకున్నారు. మన తెలుగుబిడ్డ పీవీ నరసింహారావు ఏకంగా 16 భాషలను నేర్చుకుని, ఎత్తులు, జిత్తులు, గ్రూపులకు నిలయం అయిన కాంగ్రెస్‌పార్టీలో అందరినీ ఏకం చేసి ఏకంగా ప్రధానమంత్రి స్థాయికి చేరుకున్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి చెరిగిపోని ముద్ర వేసుకున్నారు. ఇక నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు 14 భాషల్లో అనర్గళంగా ప్రసంగించే నేర్పును, సంభాషించే కళాత్మకతను పెంపొందించుకుని ఒకప్పుడు ఉత్తర భారతదేశ పార్టీగా ముద్రపడిన భారతీయ జనతాపార్టీకి ఏకంగా జాతీయ అధ్యక్షులు కాగలిగారు. హిందీ భాషలో అపార నైపుణ్యం, అందరినీ ఆదరించి అభిమానించే మనస్థత్వం వల్లే వారికి అంతటి గుర్తింపు దక్కింది. ఇదే క్రమంలో ఆయన కేంద్రమంత్రిగా, భారత ఉపరాష్ట్రపతిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఇలాంటి దిగ్గజాలెందరో మాతృభాషలో నైపుణ్యాలు పెంచుకుంటూనే ఇతర భాషలపై పట్టుపెంచుకుని అంచెలంచెలుగా ఎదిగి అత్యున్నత స్థానాలను అధిరోహించారు. కళ్లముందే ఇంతమంది మహనీయులు కనిపిస్తున్నా , ఇంకా ఉనికి కోసమో, విభజన రాజకీయాల కోసమో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తే, భవిష్యత్ అంధకారం కాక తప్పదని పలువురు నాయకులు తెలుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఏదేమైనా రాజ్యాంగం ఆమోదించిన 22 భాషలూ సమానమేనని, ప్రజలందరూ స్వేచ్ఛగా తమకు నచ్చిన భాష నేర్చుకునే, మాట్లాడే అవకాశాన్ని ఎవరూ అడ్డుకోరాదనే విషయాన్ని ప్రతి నాయకుడూ గ్రహించాల్సిన అవసరం ఉంది..!



# జోలెపట్టి.. భిక్షపట్టి ఆరంభించిన... సంగీతోత్సవాలకు.. 60 ఏళ్ళు!

## శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి-యనమండ్ర వెంకటేశ్వరశాస్త్రిల సంకల్పబలంతో నేటికీ వైభవంగా జరుగుతున్న శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు

***నెల్లూరులో ఈనెల 19 నుంచి 60వ భిక్షాటనా పూర్వక త్యాగరాజ స్మరణోత్సవాలు సందడిగా ప్రారంభమయ్యాయి. హరికథలు, సంకీర్తనా గానాలు, శాస్త్రీయ సంగీత కచ్చేరీలు, సంప్రదాయ నృత్యాలతో టౌన్‌హాలు ప్రాంగణం మార్మోగిపోతోంది. త్యాగరాజ భిక్షువు.. ప్రసిద్ధ ఆధ్యాత్మికవేత్త.. శ్రీపతి పండితా రాధ్యుల సాంబమూర్తి, ఆయన మిత్రులు..శ్రీ త్యాగరాజస్వామి ఆరాధకులు యనమండ్ర వేంకటేశ్వరశాస్త్రి కలసి.. నెల్లూరు నగరంలో జోలెపట్టి.. భిక్షపట్టి సంగీతసేవకు నడుంబిగించి.. ఇప్పటికి 60 ఏళ్ళు. నెల్లూరును మరో తిరువయ్యూర్‌గా తయారు చేసి, ప్రజలకు భక్తి సంగీత జ్ఞానాన్ని.. గానాన్ని పంచిపెట్టిన ఆ మహనీయులు ప్రారంభించిన భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభకు.. ఇప్పుడు 60 ఏళ్ళు!..***

'నిధి చాలా సుఖమా..రాముని సన్నిధి సేవ సుఖమా' అంటూ శ్రీరామ పాదసేవలో తరించిన శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనను నెల్లూరులో కూడా మహత్తరంగా జరిపించాలని, స్ఫూర్తిదాయకమైన ఆ మహానుభావుని భక్తిప్రపత్తులను లోకానికి చాటాలనే తపనతో.. ఒక తపస్సులా వారు ఈ ఉత్సవాలను ప్రారంభించారు. అయితే, కాలక్రమంలో వారు పరమపథం చేరుకున్నా, వారి వారసులు తామున్నామంటూ ఆ జోలెనందుకున్నారు. భక్తి సంకీర్తనలు గానం చేస్తూ..రోజుల తరబడి నగరంలో భిక్షాటన చేసి, తద్వారా వచ్చిన సొమ్ముతో, దాతల సహకారంతో.. కమిటీ సభ్యులు.. భక్తులు, ప్రజల ఆదరణతో ఈ స్మరణోత్సవాలను ప్రతిఏటా నిరాఘాటంగా నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ ఉత్సవాలకు ఆద్యులైన పుణ్యమూర్తి శ్రీ సాంబమూర్తి తనయులైన భారతీయ సినీ గాయకులు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం సహకారంతో, వెంకటేశ్వరశాస్త్రి తనయుడు యనమండ్ర నాగదేవిప్రసాద్ సారథ్యంలో ఉత్సవాలు నిర్వహింపబడుతున్నాయి. బాలూ పరమపదించాక, ఇప్పుడు ఆయన తనయుడు ఎస్‌పి చరణ్ గౌరవాధ్యక్షులుగా నేటికీ ఆ సంగీత వారసత్వం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో టౌన్‌హాల్ ప్రాంగణంలో ఈనెల19 నుంచి 60వ శ్రీత్యాగరాజ స్మరణోత్సవాలు ప్రారంభమయ్యాయి.

### ఆకట్టుకున్న సంకీర్తనా గానాలు :

ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు (బుధవారం) వేదాయపాళెంలోని శ్రీ త్యాగరాజస్వామి మందిరం నుంచి శ్రీ సీతారామ లక్ష్మణ, హనుమత్ సమేత శ్రీ త్యాగరాజస్వామి వార్ల విగ్రహాలను ఊరేగింపుగా టౌన్‌హాల్ ప్రాంగణానికి తీసుకువచ్చి ప్రతిష్ఠించి పూజలు చేశారు. పలువురు సంగీత కళాకారులు, నాట్య కళాకారుల కళాప్రదర్శనలతో సభాప్రాంగణం కళకళలాడింది. ప్రసిద్ధ సంగీత కళాకారులు చాగంటి రమ్య, కిరణ్మయిల బృందం గాత్ర కచేరీ అందరినీ ఆకట్టుకుంది. స్థానిక సంగీత విద్వాంసులతో పాటు దూరప్రాంతాల కళాకారులు కూడా పాల్గొని వీనుల విందుగా సంకీర్తనలు గానం చేశారు. ఈ వేడుకలో పాల్గొన్న శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి కుమార్తె..ప్రముఖ గాయని ఎస్పీ శైలజను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 60ఏళ్ళ క్రితం తమతండ్రి జీవం పోసిన ఈ సంగీతోత్సవాలు నేటికీ జయప్రదంగా కొనసాగుతుండడం ఎంతో సంతోషకరమన్నారు. తమ సోదరుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఈ ఉత్సవాలకు తమ సహకారం అందించేవారని గుర్తుచేసుకుంటూ, ఈ కార్యక్రమాలు కలకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈనెల 26 వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్న ప్రజలకు, సంగీతాభిమానులకు, తోడ్పాటునందిస్తున్న దాతలు, కమిటీ సభ్యులకు అందరికీ నాగదేవి ప్రసాద్ ఈ సందర్భంగా తమ కృతజ్ఞతలు తెలియజేశారు.





# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా మన సతీష్‌రెడ్డి



ఇటీవల (మార్చి 13వ తేదీ గురువారం) సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గౌరవపూర్వకంగా కలిసి అభినందిస్తున్న గుండ్రా సతీష్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బుధవారం నాడు నలుగురు ప్రభుత్వ సలహాదారులను నియమించుకుంది. ప్రభుత్వ అంతరిక్ష సాంకేతిక గౌరవ సలహాదారుగా ఇస్రో మాజీ ఛైర్మెన్ ఎస్.పి.సోమనాథ్‌ని, ఫోరెన్సిక్ విభాగ సలహాదారుగా ఫోరెన్సిక్ శాస్త్రవేత్త కేపీసీ గాంధీని, చేనేత హస్తకళల ప్రోత్సాహక సలహాదారుగా భారత్ బయోటెక్ సంస్థ సహ వ్యవస్థాపకురాలు సుచిత్ర యల్లాని, రక్షణ రంగ సంబంధిత పారిశ్రామిక అభివృద్ధి సలహాదారుగా డి.ఆర్.డి.ఓ. మాజీ ఛైర్మెన్ గుండ్రా సతీష్‌రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు తమ ప్రభుత్వంలో సలహాదారులుగా నియమించుకున్నారు. పై నలుగురిలో ఒక్కరికి కూడా రాజకీయ నేపథ్యం లేకపోవడం గమనార్హం.

### మన సతీష్‌రెడ్డికి కీలక భూమిక!

జాతీయస్థాయిలో రక్షణ రంగ వ్యవస్థలో అనేక కీలక పదవులలో పనిచేసిన అనుభవం మన సతీష్‌రెడ్డిది. భారత రక్షణ మంత్రికి శాస్త్ర సలహాదారుగా కూడా సతీష్‌రెడ్డి పనిచేశారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన రక్షణ రంగ విభానికి చెందిన బాధ్యతలనే ప్రభుత్వం సతీష్‌రెడ్డికి అప్పజెప్పింది. డిఫెన్స్, ఏరో స్పేస్ వంటి విభాగాలలో తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ని ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దే బాధ్యతని ప్రభుత్వం సతీష్‌రెడ్డి భుజస్కందాలపై పెట్టింది. రక్షణ రంగంలో ఆంధ్రప్రదేశ్ కీలకమయ్యేలా ఆ రంగానికి అనుసంధానమైన పారిశ్రామిక అభివృద్ధితో ఆంధ్రాని రక్షణ రంగ విభాగాల తయారీ హబ్‌గా మార్చడానికి సతీష్‌రెడ్డి సలహాలు సూచనలు తీసుకోనుంది ఆంధ్ర ప్రభుత్వం.

నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు సతీష్‌రెడ్డి స్వగ్రామం. కనీసం హైస్కూలు కూడా లేని అతి చిన్న గ్రామంలో పుట్టిన సతీష్‌రెడ్డి జాతీయస్థాయికి ఎదిగి, రక్షణ రంగంలో విశిష్ట గుర్తింపును సాధించారు. స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగి జాతీయస్థాయిలో పలువురి ప్రశంసలని అందుకున్నారు. ఎన్నో జాతీయ అంతర్జాతీయ అవార్డులు ఆయన సొంతం చేసుకున్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా క్యాబినెట్ హోదాతో నియమింపబడ్డారు. ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. మన సతీష్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.

# 'మనసు ఫౌండేషన్'.. అక్షర సేవలు అపూర్వం

## కొనియాడిన మాజీ ఎమ్మెల్సీ విఠపు



వరికుంటపాడు మండలం కనియంపాడు గ్రామంలో 'మనసు ఫౌండేషన్' వారు భావితరాల వారికి అందించేందుకు ఎన్నెన్నో గ్రంథాలు.. పుస్తకాల డిజిటలీకరణ చేయించడం ఒక బృహత్తర యజ్ఞమని..అదొక అపూర్వమైన కార్యక్రమమని మాజీ ఎమ్మెల్సీ, ప్రముఖ విద్యావేత్త విఠపు బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. ఈనెల 18న ఆయన ఆ ఫౌండేషన్‌ను సందర్శించారు. వారి కార్యాలయంలో జరిగిన డిజిటలీకరణ విభాగం 7వ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈ డిజిటలీకరణ ద్వారా జిల్లాలోని మెట్ట ప్రాంత యువతకు ఉపాధి కల్పించడం సంతోషదాయకమని ఆయన అభినందించారు.

### 3 కోట్ల పేజీల డిజిటలీకరణ ధ్యేయం...

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు మన్నం వెంకటరాయుడు మాట్లాడుతూ, ఇప్పటిదాకా అనేక గ్రంథాలు, పుస్తకాలను డిజిటలైజ్ చేయడం జరిగిందని, 2.40 కోట్ల పేజీల వరకు డిజిటలీకరణ చేశామని, వచ్చే జనవరి నాటికి 3 కోట్ల పేజీల డిజిటలీకరణ తమ ధ్యేయమని అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.



లాయర్
మార్చి 21, 2025

# కాలుష్యం కాటు.. జల వనరులకు చేటు!

జల సంరక్షణ అంటే మన ఆరోగ్య రక్షణే!.. మనం తాగేనీళ్ళు ఎంత శుభ్రంగా ఉంటే మన ఆరోగ్యం కూడా అంత బాగుంటుందన్నది సారాంశం. అయితే, చూసేందుకు ఇది చాలా స్వల్ప విషయమే అన్నట్లు అనిపించినా, నేటి ప్రపంచానికిదో పెద్ద జటిలమైన సమస్యగా తయారైంది. నానాటికీ గణనీయంగా పెరిగిపోతున్న జనాభా, మరోవైపు భూ తాపంతో మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఇంకోవైపు మానవుడు చేజేతులారా కాలుష్యాన్ని పెంచుకోవడం వంటి కారణాలతో, ప్రపంచంలోని అనేక ప్రాంతాలు తీవ్రమైన నీటికొరతను ఎదుర్కొంటున్నాయి. హిమానీ నదాలు కూడా కరిగిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే మరి కొద్ది సంవత్సరాల్లోనే ప్రపంచ ప్రజలు శుభ్రమైన మంచినీరు దొరక్క ఇబ్బందులు పడాల్సివస్తుందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. జలమే మానవాళికి జీవనాధారం. జలం లేనిదే మనిషికి జీవం ఉండదు. నీరు లేకుండా ప్రాణం నిలవదు. అయినా, జీవరాశులతో పాటు మానవుని మనుగడకు ప్రాణప్రదమైన నీటి వనరులను నేటికీ మనం కాపాడుకోలేకపోతున్నాం. మానవ తప్పిదాల వల్ల భూగర్భజలాలు కూడా కలుషితమవుతున్నాయి. పురుగుమందులు, చెత్తాచెదారం, అనేకరకాల వ్యర్థాల వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతోంది. కాలువలు, నదీనదాలు, సాగరాలు సైతం కాలుష్యం కాటుకు గురవుతూనే ఉన్నాయి. అనునిత్యం ప్రపంచవ్యాప్తంగా లక్షలాది టన్నుల ప్లాస్టిక్ తదితర వ్యర్థాలతో జీవజలాలు కాస్తా నిర్జీవం అయిపోతున్నాయి. ఆధునిక కాలంలో శాస్త్రవిజ్ఞానం ఎంత పెరిగినా, పరిశుభ్ర జలాలను రక్షించుకోలేకపోతున్నాం. వర్షాలు లేని ప్రాంతాల్లో వ్యవసాయ భూములు పండాలంటే బోర్లు, బావులే శరణ్యం. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. మొత్తంగా.. మనకున్న నీటి వనరులను సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల, వనరులను పరిరక్షించుకోకపోవడం వల్ల భవిష్యత్తులో ఇవన్నీ మరింత తీవ్రమైన సమస్యలుగా తయారవుతాయని నిపుణులు పదేపదే చెప్తున్నా పాలకులు కానీ, ప్రభుత్వాలు కానీ పెద్దగా పట్టించుకోవడం లేదు. అందులోనూ, ప్రపంచంలోనే అతిపెద్ద జనాభాగల దేశంగా వినుతికెక్కిన మనదేశంలో నీటివనరులు పుష్కలంగా ఉన్నా వాటిని కాపాడుకునే పరిస్థితి లేదు. దీంతో అనేకప్రాంతాల్లో నీటి కొరత బాగా పెరుగుతోంది. తాగేందుకు, పంటలకే కాక వంటలకు కూడా శుభ్రమైన నీళ్ళు అవసరం. గృహిణులు అనేక ప్రాంతాల్లో కడవడు నీళ్ళకోసం రెండుమూడు మైళ్లు కూడా నడిచి ఏ వ్యవసాయ బోర్ల వద్దకో వెళ్ళి, అత్యంత ప్రయాసతో మంచినీళ్ళను తెచ్చుకోవడం అందరికీ తెలిసిందే. అనేక రాష్ట్రాల్లో ఇప్పటికే భూగర్భజలాలు ఇంకిపోతున్నాయి. వేసవి కాలం అంటేనే..నీటి కష్టాలు కంటనీరు తెప్పిస్తున్నాయి. ఇప్పటికే దేశంలో దాదాపు సగం మంది ప్రజలు నిత్యం నీటి కొరతను ఎదుర్కొంటూనే ఉన్నారు. గ్రామాల్లోనే కాదు, బెంగళూరు వంటి నగరాల్లోనూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటోంది. పట్టణీకరణ ప్రభావంతో నీటి సమస్య మరింతగా ముదురుతోంది. నీటిని వాడుకోవడంలో ఉన్న శ్రద్ధ, వాటిని సంరక్షించుకోవడంలో ఉండడం లేదు. వనరులు పుష్కలంగా ఉన్నవారు నీటి విలువను గుర్తించలేక ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారు. నిరంతరం నీటిని వృధా చేసేస్తున్నారు. మురికినీటి పైపులు, మంచినీటి కుళాయిల పైపులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించకపోతుండడం వల్ల..అవి లీకేజీలకు గురైనప్పుడు మురుగునీరు-మంచినీరు కలిసిపోయి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న సంఘటనలు బోలెడు. వర్షపు నీటిని జాగ్రత్త చేసుకుని, చెక్‌డ్యామ్‌లు లేదా ఇంకుడు గుంతలు తవ్వుకుంటే భూగర్భ జలాలను పరిరక్షించుకోవచ్చనే సూచనలు సైతం ఎవరూ పట్టించుకోవడంలేదు. ఈ నిర్లక్ష్యాల మూలంగా దేశంలో ఎంతోమంది జనం నిత్యం నీటి కోసం కోటి పాట్లు పడుతున్నారు. ఇలాంటి సమస్యలన్నిటినీ ఒకసారి పునరాలోచించుకుని, ఈ సంక్షోభాలు తీవ్రతరం కాకుండా ప్రపంచం ముందుకు సాగాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 1993 నుండి ప్రతి ఏటా మార్చి 22న 'ప్రపంచ జల దినోత్సవం' నిర్వహణకు పిలుపునిచ్చింది. ఈ ఏడాది (2025) ఈ దినోత్సవం ధ్యేయం హిమానీ నదాల సంరక్షణ'. ఎందుకంటే ప్రజలకు స్వచ్ఛమైన నీరందించే కీలకమైన జలవనరులు అవి. ఆరోగ్యకరమైన స్వచ్ఛమైన నీరందించేవే హిమానీ నదాలు కరిగిపోకుండా కాపాడుకోవడానికి ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఏదేమైనా.. నీటిని కాపాడుకోవాలి-ప్రాణాలను రక్షించుకోవాలి' అనే నినాదంతో ఈ ఏడాది జల దినోత్సవం జరుగనుంది. నీటివనరులను కాపాడుకుంటూ, భావి తరానికి కూడా పరిశుభ్రమైన నీరందించేందుకు మనం ఇప్పటినుండే తయారుకావాలి.

(మార్చి 22, ప్రపంచ జల దినోత్సవం)

# కలికాల ప్రభావం.. గుంజిళ్ళు తీసిన గురువు!

ఇటీవల విజయనగరం జిల్లా, బొబ్బిలి మండలం పెంట గ్రామంలో ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుంజి రమణ ప్రవర్తించిన తీరు బాధాకరం. తన ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు సరిగ్గా మార్కులు పొందడం లేదని, చాలామంది పిల్లలు సరిగ్గా స్కూలుకి రావడం లేదని ఆవేదన చెందాడు. పిల్లలకి, వారి తల్లితండ్రులకి ఎన్నిసార్లు చెప్పినా మార్పు రావడంలేదని ఆయన వినూత్న నిరసన తెలిపాడు. స్కూలు అసెంబ్లీ సమయంలో తనని తానే శిక్షించుకున్నాడు. పిల్లల ముందు నిలబడి గుంజీలు తీసి, సాష్టాంగ నమస్కారం చేశాడు. మిమ్మల్ని శిక్షించలేం... అందుకే నన్ను నేనే శిక్షించుకుంటున్నా... ఇకనైనా మారండి! అంటూ చిన్నారులకి, వారి తల్లితండ్రులకి పిలుపునిచ్చారు. పిల్లలపైన చర్యలు తీసుకోలేని అసహాయ స్థితిలో ఆయన చేసిన పని శోచనీయం. ఒకప్పుడు గురువులకి పిల్లలు సాష్టాంగం పెట్టేవాళ్ళు, గురువులు పిల్లలచేత గుంజిళ్ళు తీయించేవాళ్ళు. కానీ, ఇప్పుడు అది రివర్సయ్యింది. గురువే గుంజిళ్లు తీసి పిల్లలకి సాష్టాంగ నమస్కారం పెట్టే పరిస్థితి దాపురించింది. కలికాలం అంటే ఇదే కాబోలు! – రమాపతి, **విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, కావలి.**

# ఎంబైపీసీ మంచి ఆలోచన..!

ఇంటర్మీడియట్ చదివే వారి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాబోయే విద్యా సంవత్సరం నుండి కొత్త విధానాన్ని మొదలు పెట్టబోతోందని చదివి సంతోషమేసింది. ఏంపీసీ, బైపీసీలని కలిపి ఎంబైపీసీని ఇంటర్మీడియట్ విద్యార్థిలోకానికి అందించబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సంస్కృతాని(సాన్‌స్క్రిట్)కి బదులుగా బైపీసీ వాళ్ళు మ్యాథమెటిక్స్, ఎంపీసీ వాళ్ళు బయాలజీ తీసుకోవచ్చు. ఇది రెండు గ్రూపుల వారికీ ఉపయోగకరమే. దీంతోపాటు ఇంటర్మీడియట్ పిల్లలకి ఏప్రిల్ నెలలో సెలవులు లేకుండా 24వ తేదీ వరకూ ప్రభుత్వ కళాశాలలు తరగతులు నిర్వహించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రైవేట్ కళాశాలలకి కూడా అనుమతి ఇచ్చింది. అటు విద్యార్థి లోకంతో పాటు ఇటు ప్రైవేట్ విద్యాసంస్థలకి కూడా ఇది శుభవార్త. రహస్యంగా తరగతులు నిర్వహించుకోవలసిన అవసరం, ఆవశ్యకత వారికికలేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని సద్వినియోగం చేసుకోగలిగితే అందరికీ మంచిదే...! – డి.హరిత **- గూడూరు.**




## కస్తూరిదేవికి కార్పొరేట్ కళ
# సంతోషదాయకం!

నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణంలో అంతర్జాతీయ స్థాయి స్కూలు వస్తుందని తెలిసి సంతోషమేసింది. నాకు ఆ సంస్థతో ఎన్నో మధుర అనుభూతులు, జ్ఞాపకాలు ఉన్నాయి. నా పెళ్ళి కూడా అక్కడే జరిగింది. ఆమధ్య వచ్చిన కొన్ని తప్పుడు వార్తలు విని బాధ కలిగింది. వాటన్నిటికీ చెంపపెట్టులాగా జీవీకే రెడ్డి గారు సమాధానం చెప్పారు. జీవీకే అంతర్జాతీయ స్కూలుని ప్రత్యేకంగా బాలికల కోసమే ప్రారంభించడం కూడా మంచి నిర్ణయం. పవిత్ర ఆశయంతో ఆనాటి పెద్దలు స్థాపించిన సంస్థ కస్తూరిదేవి విద్యాలయం. అలాంటి గొప్ప సంస్థ ఇప్పుడు జిల్లాలోనే నెంబర్‌వన్ అనేలా రూపుదిద్దుకోవడం చాలా గొప్ప విషయం. జీవీకేరెడ్డి గారికీ, కమిటీ సభ్యులకి నా అభినందనలు!

లక్ష్మీ భవాని **- ఓర్లాండో, ఫ్లోరిడా.**




# 'కల్తీ'ల మాయాజాలం!.. జనం జేబులకి గ్యాలం!

కల్తీ... కల్తీ... కల్తీ...! ఎక్కడ చూసినా కల్తీయే. ఒక్క కంటి నీరు, తల్లి పాలు తప్ప సమాజంలో సర్వం కల్తీ మయమైపోయాయి. తినేతిండి, తాగేనీళ్ళతో సహా అన్నిరకాల వస్తువులను కల్తీ చేసేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే అత్యంత సులభమైన వ్యాపార మార్గంగా కల్తీని ఎంచుకుంటున్నారు. దర్జాగా కోట్లాది రూపాయలను ఆర్జించే అక్రమార్కులకు ఈ కల్తీవ్యాపారం ఒక అడ్డాగా మారిపోయింది. సులభ ఆదాయ వనరుగా ఈ కల్తీ అవతరించింది. అడిగేవారు.. ఆపేవారు లేకపోవడంతో, మనదేశంలో కల్తీవ్యాపారులే మార్కెట్ మహారాజులుగా వెలిగిపోతున్నారు. ఒకప్పుడు ఏ కొన్ని వస్తువుల్లోనో కల్తీ ఉండేది. ఇప్పుడు ప్రతి దాంట్లోనూ కల్తీయే. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల్లో, వంటింటి సామాగ్రిలో ఈ కల్తీ రాజ్యమేలుతోంది. బియ్యం మొదలుకుని ఉప్పు, పప్పు, పిండి, నూనె, మసాలా దినుసులు ఇలా చెప్పుకుంటూ పోతే... కల్తీకి కాదేది అనర్హం అన్నట్లుగా సకలం, సమస్తం కల్తీ మయమే.

### రోజులు మారాయి...!

పాతరోజుల్లో పొట్టకూటి కోసం పాల వ్యాపారస్తులు పాలల్లో కొద్దిగా నీళ్ళు కూడా కలిపి అమ్మేవారు. ఇప్పుడు రోజులు మారాయి, నీళ్ళల్లో పాలుపోసి అమ్మేస్తున్నారు. ఆ రోజుల్లో ఏ వ్యాపారమైనా ఎంతో కొంత న్యాయంగా సాగేది. గతంతో పోల్చుకుంటే, ఒకప్పటి కల్తీల రూపం ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. ప్రజల ఆరోగ్యాన్ని సర్వనాశనం చేసైనా సరే, కోట్లు సంపాదించుకోవాలనే దుగ్ధ ఎక్కువైపోయింది. దాంతో, కల్తీ సరుకులు, నాసిరకం వస్తువులు కుప్పలుతెప్పలుగా మార్కెట్‌లోకి ప్రవాహంలా వచ్చిపడుతున్నాయి. కొన్ని ప్రధాన బ్రాండ్లకి పోటీగా ఇంచుమించుగా అసలు వాటి పేర్లకి దగ్గరగా నకిలీ బ్రాండ్లని తయారు చేసి మార్కెట్లోకి వదులుతున్నారు. అసలుకి నకిలీకి తేడా పోల్చుకోలేనంత గొప్పగా వాటిని తయారుచేసి అసలు బ్రాండ్లతో కలిపేస్తున్నారు. ఇలాంటి వ్యవహారంలో రీటైల్ వ్యాపారస్తులు కూడా ఈ నకిలీ సంస్థలకి కొమ్ము కాసి సొమ్ము చేసుకుంటున్నారు.

### రకరకాల కల్తీలు..అనేక రకాల మోసాలు :

మార్కెట్‌లో అంతా నిశ్శబ్ద మోసాలే. అమాయక జనం డబ్బులిస్తుంటారు, మారు మాట్లాడకుండా వస్తువులు కొనుక్కుంటుంటారు. అంతా సవ్యంగా జరిగిపోతుంది. వాటిలో ఏ మేరకు కల్తీలుంటున్నాయో పట్టించుకునేవారుండరు. సరిగ్గా ఆ బలహీనతనే అలుసుగా తీసుకుని కల్తీవ్యాపారులు తమ టక్కుటమారా విద్యలతో జనం జేబులకి గాలం వేసేస్తున్నారు. మనం రోజూ తినే, తాగే పదార్థాలన్నిటిలోనూ ఈ కల్తీలుంటున్నాయి. పాలల్లో కల్తీ, నీళ్ళల్లో కల్తీ, కూరల్లో కల్తీ, కూరగాయల్లో కల్తీ, పప్పుల్లో.. నెయ్యిల్లో.. నూనెల్లో.. తేనెల్లో.. అన్నిటిలోనూ కల్తీలే. మాంసాహారాల్లో కూడా కల్తీలే. చికెన్‌లో కల్తీ.. మటన్‌లో కల్తీ. చివరికి, చెట్లకు కాసిన కాయల్ని, పండ్లని కూడా రంగుపూసి మాయచేస్తున్నారు. పచ్చి కాయలను రసాయనాలతో మాగించి, పసుపుపచ్చని పండ్లుగా మార్చేస్తున్నారు. చేపలగుంటల్లో కుళ్ళిపోయిన చికెన్‌వ్యర్థాలు వేసి పెంచి, చేపలు బాగా బరువు వచ్చాక.. వాటిని మార్కెట్లకు తరలిస్తున్నారు. నేటికీ అనేక ప్రాంతాల్లో ఈ అనైతిక వ్యాపారం నిరాఘాటంగా సాగిపోతూనే ఉంది. ఆ చేపల్ని తిన్నవారికి ఎన్ని రకాల జబ్బులొచ్చి ఏమైపోతున్నారో.. ఆ భగవంతుడికే తెలియాలి!.. అయినా పట్టించుకునే నాధులే లేరు.

### అధికమవుతున్న ఆన్‌లైన్ మాయలు!

ఆన్‌లైన్ ద్వారా నిత్యావసర సరుకులు కొనుక్కునే వారికి సైతం కల్తీల బెడద తప్పడంలేదు. అమెజాన్ లాంటి ప్రఖ్యాత ఆన్‌లైన్ అమ్మకందారుల ద్వారా కొన్ని వస్తువులు కూడా కొన్ని నకిలీవి వస్తున్నాయన్న వదంతులు ఇటీవల ఎక్కువగా వినపడుతున్నాయి. బ్రాండెడ్ డబ్బాలలోనే నకిలీలని నింపి వినియోగదారులకి పంపే కొన్ని సంస్థల గుట్టుని ఇటీవల అధికారులు రట్టుచేశారు. ఇలాంటి సంస్థలు దేశవ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నాయి. వాటన్నిటినీ నియంత్రించడం అన్నది అసాధ్యమైన పని.

### 'దమ్ముంటే పట్టుకోండి'!...

కల్తీల్లో కూడా అనేకరకాలు ఉంటాయి. ఒక మోస్తరు కల్తీల్లో ధనాశే ప్రధానంగా ఉంటుంది. మరీ ప్రమాదకరమైన కల్తీల్తో ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఉంటుంది. తాగేవాటినీ, తినేవాటినీ కల్తీ చేయడంతో ప్రజల ఆరోగ్యం నాశనమవుతుంటుంది. పానీయాలను రసాయనాలతో కల్తీచేయడం, కలుషిత పదార్థాలతో ఆహారాన్ని కల్తీ చేయడం వంటివాటికి జైలుశిక్షలు జరిమానాలు కూడా ఉన్నాయి. కల్తీలను నివారించడానికి ఆహార కల్తీనిరోధక చట్టం–1954లోనే వచ్చింది. దానికి తోడుగా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ల వ్యవస్థ కూడా ఉంది. కల్తీ చేసిన ఆహారపదార్థాలను దిగుమతి చేసుకోవడం, కల్తీ పదార్థాలు తయారుచేయడం, లేదా అమ్మడం, పంపిణీ చేయడం, ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఏ కల్తీ చేసినా అది చట్టప్రకారం నేరమవుతుంది. శిక్ష కూడా ఉంటుంది. తప్పుడు వారంటీ ఇచ్చినా సరే, ఆరునెలల జైలుశిక్ష, మూడేళ్ల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది. తప్పుడు బ్రాండ్‌లతో నాణ్యతలేని వస్తువులను అమ్మడం, కల్తీలు చేస్తూ వినియోగదారులను ఉద్దేశపూర్వంగా మోసం చేసేవారిపై చర్యలు తీసుకోవడం వీటి ధ్యేయం. కల్తీ వల్ల మరణించడం, లేదా తీవ్రమైన అనారోగ్యాన్ని తెచ్చే ఆహారపదార్థాలను కలిగివున్నా, వాటిని విక్రయించినా, పంపిణీ చేసినా ..మరింత కఠినంగా మూడేళ్ల జైలుశిక్ష ఉంటుంది. పరిస్థితి తీవ్రతను బట్టి ఆ శిక్షను 'జీవితాంతం జైలుశిక్ష'గా కూడా పొడిగించవచ్చు. అంతేకాక, భారీ జరిమానాలు కూడా ఉంటాయి. అయితే, చట్టాలన్నీ బాగానే ఉన్నా, వాటిని అమలుచేసే వారే కరువయ్యారు. ఉన్నవారిలో ఎక్కువశాతం అమ్యామ్యాలకి అలవాటు పడిపోయారు. దాంతో, 'దమ్ముంటె పట్టుకోండి' అన్నట్లుగా కల్తీ మాఫియాలు రెచ్చిపోతున్నాయి.

ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్ళుతెరచి, దేశంలోని అన్నిప్రాంతాల్లో ఈ కల్తీల నివారణకు ప్రత్యేక అధికారులతో కూడిన కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటుచేయడం చాలా అవసరం!

- రాజశ్రీ

# ఇరిగేషన్ ఆక్రమణలను ఎప్పుడు తొలగిస్తారు?



- అసెంబ్లీలో సోమిరెడ్డి

నెల్లూరు జిల్లాలోని పలు లేఅవుట్ల ఏర్పాటు సందర్భంగా కాలువలకు బఫర్ వదలకపోగా, ఆ కాలువలతో పాటు ఇరిగేషన్ స్థలాలను కూడా ఆక్రమించేశారని, కళ్ల ముందే ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా సంబంధిత అధికారులతో పాటు రెవెన్యూ శాఖ పట్టించుకోవడం లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసెంబ్లీ దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ, రైతుల అవసరాల కోసమే పనిచేయాల్సిన ఇరిగేషన్ అధికారులు ఆ అంశాన్ని విస్మరిస్తున్నారన్నారు. తోటపల్లి గూడూరు మండలానికి ప్రధాన సాగునీటి వనరు అయిన కోదూరు కాలువ ఆక్రమణకు గురైందని, వరిగొండ పంచాయతీలోని రాపూరువారి కండ్రిగలో 2 ఎకరాల విస్తీర్ణంలోని కాలువలను పూర్తిగా లేఅవుట్‌లో కలిపేసుకున్నారని ఆయన చెప్పారు. వెంకటాచలం మండలం చెముడుగుంట పరిధిలో జాతీయ రహదారి పక్కనే లేఅవుట్లలో కాలువలు ఆక్రమణకు గురయ్యాయని, పొదలకూరు మండల పరిధిలో ఓ లేఅవుట్ ఏర్పాటు కోసం ఏకంగా కండలేరు ఎడమ కాలువ అలైన్మెంటు మార్చేశారని, కొన్ని లేఅవుట్లలో మొదట ఓపెన్ స్పేస్ చూపించి, చివరలో ప్లాట్లుగా మార్చి అమ్మేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ఓ వైపు రైతుల భవిష్యత్‌కు సంబంధించిన కాలువలు అన్యాక్రాంతమవుతున్నాయని, మరోవైపు ప్లాట్లు కొనుగోలు చేసిన వారి భవిష్యత్ అవసరాలకు అడుగు స్థలం కూడా వదిలిపెట్టకుండా దుర్మార్గాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ఇరిగేషన్ స్థలాల ఆక్రమణల తొలగింపు విషయంలో ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పినా లొంగకుండా అధికారులు విధులు నిర్వర్తించేలా స్పష్టమైన ఆదేశాలివ్వాలని, ఈ ప్రక్రియలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులకు కూడా బాధ్యతలు అప్పచెప్పాలని ఆయన సూచించారు.

## ఆక్రమణలు నిజమే..

- మంత్రి నిమ్మల

నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ఆక్రమణలు నిజమేనని అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. మొత్తం 67 ఆక్రమణలు జరిగాయని, దాంతో 18,951 ఎకరాల ఆయకట్టు ప్రభావితమవుతోందని తెలిపారు. ఆ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమస్యలను సీరియస్‌గా తీసుకోవాలని, ఎక్కడా రాజీపడవద్దని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రభుత్వానికి సూచించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకులు చెప్పినట్టు అధికారులు నడుచుకుని వ్యవస్థలు నిర్వీర్యం చేసినందునే ఇలాంటి పరిస్థితులు తలెత్తాయని, అధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రతి ఆక్రమణ తొలగింపునకు కఠినచర్యలు తీసుకుంటామని మంత్రి రామానాయుడు సభకు హామీ ఇచ్చారు.

# అమరజీవి త్యాగం..అజరామరం!

## నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ ఆనంద్



ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను పణంగా పెట్టిన త్యాగమయుడు.. శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం చరిత్రలో అజరామరంగా నిలిచి ఉంటుందని, ఆ మహనీయుడు మన నెల్లూరు జిల్లావాసి కావడం జిల్లా ప్రజల అదృష్టమని కలెక్టర్ ఆనంద్ అన్నారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా, నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ ఆనంద్, నగరపాలకసంస్థ కమిషనర్ సూర్యతేజ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుతో దేశంలోనే గొప్ప మార్పుకు శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆ మహనీయుని పోరాటస్ఫూర్తితోనే మనదేశంలో భాష ఆధారంగా అనేక రాష్ట్రాలు ఏర్పడ్డాయని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయనే ఆద్యులని అన్నారు. స్వతంత్ర భారతావని ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు కూడా దేశంలోని అన్ని రాష్ట్రాలు వారి సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ, ఎటువంటి వివాదాలు లేకుండా ఐక్యతగా ఉండడానికి ప్రధాన కారణం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితమేనని గుర్తు చేశారు. నెల్లూరుజిల్లాకు ఆయన పేరు పెట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. బీసీ సంక్షేమ అధికారిణి వెంకటలక్ష్మి, పలువురు ఆర్యవైశ్య నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మునిపల్లె రాజుకు.. 'అరసం' నివాళి




ప్రముఖ కథారచయిత మునిపల్లెరాజు కథలను గుర్తుచేసుకుంటూ, నెల్లూరులోని పలువురు కవులు, కథా రచయితలు ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈనెల 17న నగరంలోని ప్రముఖ నవలా-కథా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద నివాసంలో మునిపల్లె రాజు శతజయంతి సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ప్రముఖ కవి డా. పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ, మునిపల్లె రాజు తొలుత శ్రీశ్రీ ప్రభావంతో కవిత్వం రాశారని, ఆ తర్వాత కథలవైపు మళ్ళి గొప్ప కథలు రచించారని తెలిపారు. వారు రచించిన 'సరోజ కథ'ను విశ్లేషిస్తూ, మనిషి జీవితంలో ఎదురయ్యే ఆధ్యాత్మిక, భౌతిక, తాత్విక కల్లోలాలను, మానసిక సంఘర్షణను ఆయన కరుణ రసాత్మకంగా చిత్రించారని కొనియాడారు. అరసం ఉపాధ్యక్షుడు డా. టేకుమళ్ళ వెంకటప్పయ్య, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద మునిపల్లె కథల్లోని విశిష్టతను వివరించారు. అరసం అధ్యక్షుడు, ప్రముఖ బాలసాహితీవేత్త డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ, మధురాంతకం రాజారాం, సభా లాంటి కథకుల కథలు, మునిపల్లె కథలు మానవీయకోణంలో ఉంటాయని వివరించారు. ప్రముఖ కవులు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, అవ్వారు శ్రీధర్ బాబు, ఆర్టిస్ట్ రాము తదితరులు పాల్గొని, మునిపల్లె వారి కథలను మననం చేసుకొని నివాళులర్పించారు.

# గర్భస్థ శిశువులను కాపాడుకోవాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ సుజాత



గర్భస్థ శిశువులను కాపాడుకోవాలని, జిల్లాలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నామని జిల్లా వైద్యాధికారి సుజాత తెలిపారు. ఈనెల 18న నెల్లూరులోని డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు 8 మంది అధికారులను నియమించినట్లు చెప్పారు.

# 'ఉపాధి హామీ'ని దోచేశారు!

- 14 మందిపై చర్యలకు రంగం సిద్ధం
- రూ. 30.52 లక్షల రికవరీకి ఆదేశాలు

పేదలకు ఉపాధి కల్పించే ఉపాధిహామీ పథకం అవినీతి అధికారులు, సిబ్బందికి కామధేనువులా మారింది. అందినకాడికి దోచుకుతినేవారికి ఇదో వరమైంది. ఎవరెంత దోచుకున్నా, కఠినమైన చర్యలేమీ లేకపోవడంతో ఈ అవినీతి ఎంతోకాలంగా చాలాచోట్ల నిరాఘాటంగా సాగిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో, అక్రమార్కులు అదే అదనుగా భారీ స్థాయిలో అవినీతికి పాల్పడినట్లు తేటతెల్లమవుతోంది. ఇటీవల జిల్లాలోని సీతారామపురంలో జరిగిన సామాజిక తనిఖీల్లో, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని ఆధ్వర్యంలో అలాంటి అవినీతి అధికారులను గుర్తించి, మొత్తం 14 మందిని సస్పెండ్ చేసేందుకు రంగం సిద్ధం చేశారు కూడా.

2023-24 సంవత్సరంలో సీతారామపురం మండలంలో 8 కోట్ల 35 లక్షలకు పైగా వ్యయంతో 649 రకాల ఉపాధి పనులు జరిగితే, ఆ పనుల్లో అన్నీ అవకతవకలే జరిగాయని తేలింది. సోషల్ ఆడిట్ అధికారులు గ్రామాల్లో పర్యటించి ఎక్కడెక్కడ పనులు ఎలా జరిగాయో పూర్తిస్థాయిలో పరిశీలించడంతో అనేకమంది అక్రమార్కుల అవినీతి గుట్టు రట్టయింది. ఆ పనుల్లో చాలామటుకు అవినీతి జరిగినట్లు తేలడంతో తదుపరి చర్యల కోసం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపారు.

## ఇష్టారాజ్యంగా పనులు :

ఉపాధి హామీ పనుల నిర్వహణకు పలు నిబంధనలున్నా, ఆ పనులు నిర్వహించే అధికారులు-సిబ్బంది వాటినేమీ పట్టించుకోకుండా ఎవరిష్టప్రకారం వారు పనులు చేయిస్తుండడం సర్వసాధారణమైపోయింది. అలాచేయడం వెనుక ఎన్నో మతలబులుంటాయి కూడా. పలు గ్రామాల్లో ఒకే కుటుంబంలో రెండు, మూడు జాబ్‌కార్డులు కూడా ఇవ్వడం, నిర్దిష్టమైన కొలతల ప్రకారం పనులు చేయకపోవడం వంటి నిర్లక్ష్యాలను కూడా సోషల్ ఆడిట్ గుర్తించింది. సీతారామపురంలో ఉన్నతాధికారుల సమక్షంలో ఇటీవల జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఈ బండారమంతా బయటపడింది. అవినీతికి అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యాక, ఒక ఏపీఓ, ఇసితో పాటు ముగ్గురు సాంకేతిక సహాయకులు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఆరుగురు క్షేత్రసహాయకులు, ఒక సీనియర్ మేట్‌ను సస్పెండ్ చేసేందుకు నిర్ణయించారు. డ్వామా పీడీ ఆమేరకు వారిపై చర్యల కోసం కలెక్టర్‌కు సిఫారసు చేసినట్లు సమాచారం. ఒక్క సీతారామపురం పంచాయతీ పరిధిలోనే 5.84 లక్షల మేరకు అవకతవకలు జరిగినట్లు ఆడిట్‌లో తేలింది. అదేవిధంగా, అయ్యవారిపల్లి, బాలాయపల్లి, బసినేనిపల్లి, పోలంగారిపల్లి, దేవిశెట్టిపల్లి, గుండుపల్లి, జయపురం, మారంరెడ్డిపల్లి, నెమళ్లదిన్నె, పబ్బులేటిపల్లి, సింగారెడ్డిపల్లి గ్రామాల్లో జరిగిన గోల్మాల్ వ్యవహారాలన్నిటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందింది. దాంతో, మొత్తంగా సీతారామపురం మండలంలోని 14 పంచాయతీల్లో 30.52 లక్షల రూపాయల మేరకు రికవరీకి ఆదేశించినట్లు తెలుస్తోంది.

## అవినీతిపరులను వదిలేది లేదన్న పవన్ :

ఉపాధి హామీ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అవకతవకలను కూటమి ప్రభుత్వం వచ్చాక ఆడిట్ చేయించి నిజానిజాల నిగ్గు తెలుస్తోంది. గత ప్రభుత్వ పాలనలో ఉపాధి హామీ పథకంలో భారీ స్థాయిలో అక్రమాలు జరిగాయని ఇప్పటికే తమ పరిశీలనల ద్వారా నిర్ధారించింది. సుమారు 250 కోట్ల రూపాయల మేర అవినీతి జరిగినట్లు ఆడిట్‌లో తేలిందని ఈనెల 17న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో చెప్పారు కూడా. పనులు చెయ్యకుండానే మస్టర్లు వేశారని, స్థానికంగా కుమ్మక్కై నిధులు స్వాహా చేశారని ఆయన అంటూ, అవినీతిపరులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలేది లేదని, బాధ్యులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు కూడా. దీంతో ఇంతకాలంగా ఉపాధి సొమ్మును బొక్కేస్తున్న అవినీతి అధికారులు, సిబ్బందిలో వణుకుపుడుతోంది.

# ఉదయగిరిలోనూ.. స్వాహాలే!

- 17 మంది సస్పెండ్

ఉదయగిరిలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో కూడా ఇదే తీరుతో పలువురు అధికారులు, సిబ్బంది లక్షల రూపాయలను మింగేశారు. ఈనెల 18న డ్వామా పీడీ గంగాభవాని ఆధ్వర్యంలో జరిగిన సామాజిక తనిఖీలో వారి బాగోతం బయటపడింది. మొత్తం స్వాహా చేసిన 37.80 లక్షల రూపాయలను వారినుంచి రికవరీ చేయాలని ఆదేశిస్తూ, ఉపాధి హామీ నిధులను తినేసిన 17 మందిని సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయినవారిలో ఏపీఓ, ఇద్దరు ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు, ముగ్గురు సాంకేతిక సహాయకులు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, తొమ్మిదిమంది క్షేత్ర సహాయకులు ఉన్నారు. అంతేకాదు, 93 లక్షల రూపాయలకు సంబంధించిన ఫైళ్లను అప్పగించని సిబ్బందిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయడానికి ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# జడ్పీలో.. శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి



ఈనెల 16న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ మహనీయుని చిత్రపటానికి జిల్లా పరిషత్ సీఇఓ ఎం.విద్యారమ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ పరిపాలన అధికారులు ఎన్.వి.రవికుమార్, టి.రాజశేఖర్, ఎన్.వి సుబ్రహ్మణ్యం, సిహెచ్ ఉమాశంకర్, లక్కాకుల పెంచలయ్య, బి.రమేష్ బాబు, కె.భీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు..అమరజీవి



ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని త్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని, ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషిచేయాలని జనసేన సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ అన్నారు. ఈనెల 16న అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా, నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా వాసి కావడం జిల్లాకే గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్..ఉచిత వైద్యశిబిరం



నెల్లూరు ఏసీ స్టేడియంలోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ దంతవైద్యులు ఆర్.చక్రపాణి పాల్గొని, దంత సంబంధిత వ్యాధుల పట్ల, దంతాలను సురక్షితంగా ఉంచుకోవడం పట్ల అవగాహన కలిగించారు. వయసు పెరిగిన వారు దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వాకర్స్ సభ్యులకు సెన్సోఫారమ్ పేస్టు, కాల్గేట్ బ్రష్‌లను ఉచితంగా ఇచ్చారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మాగంటి ప్రసాద్, 203 డిస్ట్రిక్ట్ ఎలెక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ ప్రతినిధులు హరిబాబునాయుడు, షేక్ నజీర్ అహమ్మద్, చెంచయ్యనాయుడు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు

# దయాశీలి.. విద్యాదాత.. దొడ్ల కౌశల్యమ్మ

### --- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ---



నెల్లూరులో డీకేడబ్ల్యు కళాశాలను స్థాపించి వేలాదిమంది మహిళలకు విద్యనందించిన విద్యాదాత.. దయాశీలి దొడ్ల కౌశల్యమ్మ అని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. మహిళా సాధికారతను మాటల్లో కాకుండా తన మాతృత్వపు మమకారం, దాతృత్వపు గుణంతో 60 ఏళ్ళ క్రితమే చూపించిన మహనీయురాలు దొడ్ల కౌశల్యమ్మ అని ఆమె ప్రస్తుతించారు. డీకేడబ్ల్యు కళాశాల ప్రారంభించి 60 ఏళ్లయిన సందర్భంగా ఈనెల19న ఆ కళాశాలలో జరిగిన డైమండ్‌జూబ్లీ ఉత్సవాల్లో అరుణమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆడపిల్లలను బడులకు, కాలేజీలకు పంపేందుకు తల్లిదండ్రులు వెనకడుగు వేసే ఆనాటి రోజుల్లో అబలలను సబలలుగా తయారుచేసిన మాన వీయురాలు కౌశల్యమ్మ అని అన్నారు. ఇక్కడ చదువుకున్న ఎందరో మహిళామణులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాలలో, న్యాయ, విద్యా, వైద్య, ఆర్థిక మరియు రాజకీయ రంగాల్లోనూ, వ్యాపారవేత్తలుగానూ రాణించి, సింహపురికి వన్నె తెచ్చారన్నారు. అతిథులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్కులను అభివృద్ధి చేయాలి

### కమిషనర్ సూర్యతేజ



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పార్కులను మరింతగా అభివృద్ధి చేయాలని, పిల్లలకు ఆటవస్తువులు, క్రీడాకారులకు జిమ్ పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. ఈనెల 18న ఆయన 6వ డివిజన్‌లో పర్యటించి, పప్పులవీధి పార్కును సందర్శించారు. రోడ్లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లను ఎవరూ వాడకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్పొరేటర్ మస్తానమ్మ, ఎస్ఇ రామమోహన్‌రావు, వెటర్నరీ అధికారి డాక్టర్ మదన్‌మోహన్, హార్టీకల్చర్ అధికారి ప్రదీప్ కుమార్, రెవిన్యూ అధికారి ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

## నేత్రపర్వం..

# రంగనాథుని రథోత్సవం



నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిర రంగనాథస్వామి రథోత్సవంతో రంగనాయకులపేట వీధులన్నీ భక్తజనులతో క్రిక్కిరిసిపోయాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 16న రథోత్సవానికి భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చి, స్వామివారిని-అమ్మవార్లను దర్శించుకుని తరించారు. రథోత్సవంలో స్వామివారి ఊరేగింపు పురవీధుల్లో శోభాయమానంగా సాగింది. ఆలయ అధికారులు, నాయకులు, ప్రముఖులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అదేరోజు రాత్రి స్వామి వారికి పొన్నవాహనోత్సవం కన్నులపండువగా జరిగింది.

# సినారా ఆధ్వర్యంలో.. 21న కవి సమ్మేళనం



నెల్లూరులోని ప్రముఖ కవి.. చిన్ని నారాయణరావు(సినారా) ఆధ్వర్యంలో ఈనెల 21వ తేది సాయంత్రం 5 గంటలకు స్థానిక టౌన్‌హాల్ రీడింగ్‌రూమ్‌లో కవి సమ్మేళనం జరుగుతుంది. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోజున చిన్ని నారాయణ రావు సాహితీ ఫౌండేషన్ సారథ్యంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఈ సమ్మేళనంలో కవులు పఠించిన కవితలను పుస్తకరూపంలో తెస్తామని సినారా తెలియజేశారు. సభకు పద్య కళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ కవి శ్రీరామకవచం సాగర్ రచించిన 'నిర్వేదం' నవలను ముఖ్య అతిథి..'నుడా' ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరిస్తారని చెప్పారు. ఆత్మీయ అతిథులుగా నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరు అన్నపూర్ణ, పెరసం గౌరవాధ్యక్షులు అవ్వారు శ్రీధరబాబు, పెరసం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొంటారని, సాహిత్యాభిమానులు, కవులు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కవిసమ్మేళనంలో పాల్గొనే కవులు తమ కవితల ప్రతితో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో కూడా ఇవ్వాలని ఆయన కోరారు.

# పీసీసీ ఉపాధ్యక్షునిగా..బాలసుధాకర్



జిల్లా కాంగ్రెస్‌లో కార్యకర్త స్థాయి నుంచి ఎదిగి నాయకునిగా రాణిస్తున్న సీనియర్ నేత తలారి బాలసుధాకర్ పీసీసీ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితుల య్యారు. పీసీసీ చీఫ్ షర్మిలరెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీని 27మంది సభ్యులతో విస్తరిస్తూ, ఇటీవల నెల్లూరుజిల్లా కాంగ్రెస్ కమిటీని నియమించారు. పిసిసి జిల్లా ఉపాధ్యక్షులుగా సీనియర్ నేత తలారి బాలసుధాకర్‌ను నియమితులయ్యారు. ఈ సందర్భంగా బాలసుధాకర్ డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవ్‌కుమార్‌రెడ్డిని కలసి, ఆయనను ఘనంగా సత్కరించారు. తనకు ఆ పదవి వచ్చేందుకు కృషిచేసిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ మెంబర్ కొప్పుల రాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావ్‌యాదవ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




## 16వేల మెట్రిక్ టన్నుల

# ధాన్యం కొనుగోలు

### - జాయింట్ కలెక్టర్ కార్తీక్ వెల్లడి

జిల్లాలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్ళలో భాగంగా ఇప్పటివరకు 16వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఈనెల 18న ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం విక్రయించిన రైతులకు కేవలం 24 నుంచి 48 గంటలలోగానే డబ్బులు వారి ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఈ కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటిదాకా రైతులకు 32.95 కోట్లు చెల్లించామని తెలియజేశారు. రైతులు దళారుల మాటలు విని మోసపోవద్దని, ప్రభుత్వం నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకుని, మద్దతుధర పొందాలని ఆయన సూచించారు.

# ఆకట్టుకున్న..ఎన్‌సిసి కేడెట్ల ర్యాలీ



నెల్లూరులోని 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొరదగవే ఆదేశాల మేరకు ఇటీవల నెల్లూరు బీవీనగర్ కెఎన్ఆర్ పాఠశాల ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. పాఠశాల వద్ద నుంచి మినీబైపాస్ రోడ్డు వరకు ఎన్‌సిసి కేడెట్లు ర్యాలీ నిర్వహించి, 'ప్లాస్టిక్‌ను మానేద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అంటూ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలను నరేంద్రబాబు వివరించి అందరికీ అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇఫ్కోకి త్వరలోనే మహర్దశ!

## ఎంపీ వేమిరెడ్డి సారధ్యంలో అభివృద్ధికి కీలక అడుగులు

## ఇఫ్కో ఛైర్మెన్, సీఇఓలను కలిసిన విపిఆర్



**నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) సారధ్యంలో.. జిల్లాకు తలమానికమైన ఇఫ్కో కిసాన్ సెజ్ అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలే ధ్యేయంగా ముందుకు సాగుతున్న వేమిరెడ్డి, ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటుచేయాలనే ప్రతిపాదనలతో ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఈనెల 18న ఢిల్లీలో ఇఫ్కో కిసాన్ సెజ్ ఛైర్మెన్ దిలీప్ సంఘాని, ఇఫ్కో సీఈవో డా. ఉదయ్‌శంకర్ అవస్థిని కలసి, పరిశ్రమల ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. వారు కూడా సానుకూలంగా స్పందించారు. దీంతో త్వరలోనే ఇఫ్కోకి మహర్దశ వస్తుందని అందరూ ఆశిస్తున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా కోవూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ కోసం సేకరించిన 2777 ఎకరాల్లో అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టాలని ఆయన ఇఫ్కో ఛైర్మెన్, సీఓఇలకు విజ్ఞప్తి చేశారు.**

ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో) ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన సహకార సంస్థ అని, వ్యవసాయం, ఇతర పారిశ్రామిక యూనిట్లకు ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఎంతో ఉపకరిస్తుందని ఎంపీ వేమిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. స్పెషల్ ఎకనమిక్ జోన్ చట్టం–2005 ప్రకారం నెల్లూరులో 2009లో బహుళ–ఉత్పత్తి 'కిసాన్ సెజ్ ఏర్పాటు అయిందన్నారు. ఇఫ్కోలో పరిశ్రమలకు ప్రధాన అవసరాలైన విద్యుత్, నీరు, భద్రత వంటి వసతులు కల్పించేందుకు రూ. 300 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. ప్రస్తుతం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్, నీరు, మురుగునీటి శుద్ధి కర్మాగారం, అంతర్గత రోడ్లు, నీటి పారుదల వ్యవస్థ, 24 గంటల భద్రత తదితర సౌకర్యా లతో పాటు 34,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉపయోగానికి అనువుగా ఉన్న కార్యాలయ స్థలం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వారికి వివరించారు. ప్రస్తుతం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సిమెన్స్ గమేసా రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, 2017లో ఏర్పాటై 150 ఎకరాల్లో కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. అదే విధంగా హిందుస్తాన్ కోకాకోలా బెవరేజెస్ లిమిటెడ్ (హెచ్‌సీసీబి) తమ యూనిట్ల కోసం 150 ఎకరాలను తీసుకుందని, దీంతోపాటు ఇతర పెట్టుబడిదారులు కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని ఆయన వారి దృష్టికి తెచ్చారు.

### పరిశ్రమలు వస్తే.. వేలాదిమందికి ఉద్యోగాలు

జిల్లాలో నైపుణ్యాలున్న యువతకు కొరత లేదని, ఇఫ్కో సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటయితే.. జిల్లాలో వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని విపిఆర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. తద్వారా స్థానికులకు ఉపాధి మెరుగుపడుతుందని వివరించారు. అంతేకాక, జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని ఆయన ఆకాంక్షించారు. ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ఇఫ్కో ఛైర్మెన్, సీఇఓలు ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిస్థితిని పరిశీలిస్తామని, తప్పకుండా ఆ సెజ్ భూములను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.



# ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

## ధాన్యం రైతులకు మంత్రి నాదెండ్ల భరోసా

నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళు జోరుగా జరుగుతున్న నేపథ్యంలో, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. ఈనెల 18న ఈనెల 18న అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్‌లో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న సమస్యలను చర్చించారు. మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాలో 15 వేల టన్నులకు పైగా ధాన్యం కొనుగోళ్ళు పూర్తయ్యాయని, ధాన్యం కొనుగోలు జరిగిన 24గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు కొనసాగుతుందని, వారికి అవసరమైన గోతాలు, రవానా సౌకర్యాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. మిల్లర్లతో చర్చించి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. తేమ శాతం 17–20 ఉన్న ధాన్యాన్ని సైతం రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహమ్మద్ ఫరూక్, ఎంఎల్‌ఏలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తరలిపోతున్న తెల్లరాయి



జిల్లాలో తెల్లరాయి తవ్వకాలు చాటు మాటుగా జరిగిపోతూనే ఉన్నాయి. దొరికితే దొంగలు.. లేదంటే దొరలు. పోలీసులు ఈనెల17న దుత్తలూరు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా, అనుమానం వచ్చిన రెండు లారీలను పట్టుకున్నారు. వరికుంటపాడు నుంచి అక్రమంగా తెల్లరాయిని తరలించుకుపోతున్న ఆ వాహనాలను ఎస్ఐ ఆదిలక్ష్మి, పోలీసు సిబ్బంది స్వాధీనం చేసుకుని, గనులశాఖకు సమాచారం అందించారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో మరి!..

# శ్రీసిటీ ప్రగతి అద్భుతం!

## • ప్రశంసించిన ఎన్‌డీసీ అధికారుల బృందం



శ్రీసిటీ పారిశ్రామిక ప్రగతి ప్రశంసనీయమని నేషనల్ డిఫెన్స్ కళాశాల అధికారుల బృందం ప్రశంసించింది. భారత అంతరిక్ష పరిశోధన, డిఫెన్స్ రంగాలతో సహా పలు జాతీయ ప్రాజెక్టులకు సహకారం అందించడంలో శ్రీసిటీ పరిశ్రమల కీలకపాత్ర అద్భుతమని ఆ బృందం కొనియాడింది. భారతదేశ పారిశ్రామికవృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధిపై అధ్యయనంలో భాగంగా, న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజ్(ఎన్‌డీసీ)కి చెందిన 17మంది సభ్యుల ప్రతినిధి బృందం ఈనెల 18న శ్రీసిటీని సందర్శించింది. మేజర్ జనరల్ సి.పి.సంగ్రా.. ఏవీఎస్‌ఎం వైఎస్‌ఎం (రిటైర్డ్) నేతృత్వంలో భారత సాయుధదళాల ఉన్నతాధికారులు, విదేశీ ప్రతినిధులతో సహా వచ్చిన ఆ బృందానికి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికారు. శ్రీసిటీ ఏకీకృత వ్యాపారానుకూల వాతావరణం, ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానం, భారతదేశ తయారీ మరియు లాజిస్టిక్స్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలలో భాగస్వామ్యం గురించి ఆయన వారికి వివరించారు. ఇక్కడి ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వసతులు, నైపుణ్యాభివృద్ది వంటి పలు కార్యక్రమాలు శ్రీసిటీని స్థిరమైన వృద్ధి, సామాజిక ఆర్థిక పురోగతికి ఒక నమూనాగా మార్చాయన్నారు. శ్రీసిటీ ప్రాముఖ్యత, మేక్ ఇన్ ఇండియా చొరవకు మద్దతునిస్తూ, దేశ తయారీరంగ బలోపేతంలో శ్రీసిటీ పాత్రను ఆయన వారికి విశదీకరించారు. విస్తృతమైన ఉపాధి అవకాశాల కల్పన, మహిళా సాధికారతకు తోడ్పాటు, వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ ద్వారా ఒకప్పుడు వెనుకబడిన ప్రాంతంగా పరిగణించబడే ఈ ప్రాంతంలో శ్రీసిటీ ఎలాంటి మార్పులు తెచ్చిందో ఆయన వారికి వివరించారు. ఆ బృందం శ్రీసిటీ పరిసరాలతో పాటు కోల్గేట్, పెప్సీ పరిశ్రమలను సందర్శించారు. ఇక్కడ క్రమశిక్షణ అమోఘమంటూ టీమ్ లీడర్ అభినందించారు. ఏపీ హెచ్ ఆర్‌డీఐ డైరెక్టర్ జి.శ్రీనివాసులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.









## జానకిరామ.. రామాయణం 57

- ఊటుకూరు జానకి రామారావు

ఒక సింహాన్ని మరొక సింహం ఎదుర్కొన్నట్లుగా ఉంది.

కొంతసేపటికి ఖరుడు రాముని చేతిలోని ధనుస్సును ఒడుపుగా విరగగొట్టాడు. వెంటనే రాముడి కవచాన్ని కొట్టాడు. ఖరుడి దెబ్బకు స్వర్ణకాంతులీనే రాముని కవచం నేలమీద పడిపోయింది. వెంటవెంటనే ఎన్నో నిశిత శరాలతో రాముడిని పీడించాడు ఆ దానవుడు.

రాముడు కృద్ధుడైనాడు, కాలరుద్రుడైనాడు, పొగలేకుండా భగ్గున పైకిలేచిన అగ్నిజ్వాల అయినాడు.

అగస్త్య ముని ఇచ్చిన వైష్ణవ ధనువు చేతబూనాడు, ఒక బాణంతో రథం కాడిని, నాలుగు బాణాలతో నాలుగు గుర్రాలను, ఆరవ బాణంతో సారథి శిరస్సును, మూడు బాణాలతో రథం ముందు భాగాన్నీ, రెండుబాణాలతో రథపు ఇరుసును, ఇంకొక బాణంతో ఖరుడి ధనుస్సును, పదమూడవ బాణంతో ఖరుడిని తీవ్రంగా కొట్టాడు.

ఒక శ్రేణిలో ప్రయోగించబడిన బాణాల దెబ్బకు దిమ్మరపోయిన ఖరుడు, అన్నీ కోల్పోయినవాడై చేతిలో గద ధరించి రథం నుండి నేలమీదికి దూకాడు.

అలా నిలుచున్న వాడిని చూసి, ఎందుకురా మీరు అకారణంగా శాంత స్వభావులైన మునులను హింసిస్తారు! మీరు పూర్వం హింసించి చంపిన మునులందరూ ఇదిగో మీ చావును పైనుండి కళ్ళారా చూడబోతున్నారు. ఇదుగో నీ తల తాటిపండు రాలినట్లు నేలరాలుతుంది చూడు అంటూ తన మీదికి వాడు విసిరిన గదను చూర్ణము కావించాడు.

ఇద్దరి మధ్యా నువ్వానేనా అన్నట్లుగా సాగిన యుద్ధంలో రాముడు పైచేయి సాధించి, ఒక బాణంతో వాడి రొమ్ముమీద కొట్టగా అది పిడుగులాగా వాడిని తగిలి వాడి ప్రాణాలు తీసి భూమిలో కూరుకుపోయింది.

జనస్థానంలో రాక్షసుల ఆటలిక చెల్లవన్నట్లుగా సింహం లాగా నిలుచున్నాడు రాముడు. ఇంతమంది రాక్షసులను కేవలం ఒక గంటాపన్నెండు నిముషాలలో రామసింహం వేటాడింది.

సహజ నీలవర్ణుడు రాముడు, ఆయన శరీరం నీలాకాశంలో నిప్పుల ప్రవాహం కనపడితే ఎలా ఉంటుందో అలా ఉంది. నీలపుశరీరం మీద ఎర్రని రక్తపుచారికలు. అలా కనిపిస్తున్న రణకోవిదుడు రాముడిమీద ఆనందంతో పుష్పవృష్టి కురిపించారు దేవతలు.

రండిరా ఎవడొస్తాడో చూస్తాను!

ఇప్పుడే వేట మొదలయ్యింది అన్నట్లుగా నిలుచున్నాడు ధనుస్సు చేతబూని శ్రీరామచంద్రుడు.

జగదేకవీరుడు రాముడు అంత స్వల్పకాలంలో పద్నాలుగు వేలమంది మహాబలవంతులైన రాక్షసులను సంహరించటం చూసిన ఋషులు, మునులు, దేవతలు ఆయనను సమీపించి అభినందనలతో ముంచెత్తారు.

అప్పుడు వారొక రహస్యాన్ని విప్పి చెప్పారు, రామా నీవు శరభంగ మహాముని ఆశ్రమానికి వచ్చినప్పుడు దేవేంద్రుడు మునితో ఏదో మాట్లాడుతూ కనపడ్డాడు కదా, ఆ విషయం ఏమిటనుకున్నావు! నిన్ను ఈ ప్రాంతానికి ఏదోవిధంగా పంపితే ఎప్పటినుండో జనస్థానంలో తిష్ట వేసుకున్న రాక్షసులను ఏరిపారేస్తావని తెలిపాడు.

ఉపాయంతో నిన్ను ఇక్కడకు పంపమన్నాడు. ఆ విధంగానే నీవు ఇక్కడ నివసించేటట్లు మేం ఆలోచన చేసి నిన్ను పంపాం, ఇప్పుడు జనస్థానంలో ఒక్క రాక్షసుడు కూడా మచ్చుకైనా లేడు. ఇక మేం నిశ్చింతగా, సుఖంగా ఈ ప్రాంతంలో సంచరించగలం అని కృతజ్ఞతాపూర్వకంగా పలికి, వచ్చిన దారినే తిరిగి వెళ్ళారు.

యుద్ధపరిసమాప్తిని చూచిన లక్ష్మణుడు వదిన గారిని తీసుకుని గుహనుండి బయటకు వచ్చాడు.

అన్నగారి పరాక్రమం ఆయనకు తెలియంది కాదు. ఆయన చేసిన ఘనకార్యానికి అభినందనలు తెలిపాడు లక్ష్మణుడు.

లోకకంటకులైన రాక్షసులను ఒంటిచేత్తో మట్టికరిపించి సింహం లాగా నిలుచున్న వీరాధివీరుడైన భర్తను చూడగానే సీతమ్మ హృదయం ఉప్పొంగి కౌగలించుకొంది. ఏ మాత్రం అలసటలేని భర్తను చూసుకుంటూ మురిసిపోతూ మరలమరల ఆలింగనం చేసుకొంది వైదేహి.

ఒక్కడు మిగిలాడు! పదునాలుగు వేలమందిలో ఒక్కడు తప్పించుకొన్నాడు. వాడి పేరు అకంపనుడు.

ఆ విధ్వంసాన్ని కన్నులారా చూసిన వాడి కాళ్ళు తడబడుతున్నాయి. గుండెలలో దడ మొదలయ్యింది. ఏదో విధంగా గుండె చిక్కబట్టుకున్నాడు వాడు, వేగంగా లంకకు బయలు



దేరాడు. వెళ్ళి వెళ్ళి రావణుడి ముందు కుప్పకూలాడు. భయంభయంగా చూస్తున్నాడు.

వాడి చెవులలో ఇంకా రామకోదండం వెలువరించిన శబ్దమే మారుమ్రోగుతోంది. వాడి కన్నులలో ఆ కోదండం చేసిన వీరవిహారమే ప్రతిఫలిస్తోంది..

వాడు రావణుని ముందు నిలబడి, ప్రభూ మన రాక్షసులు పదునాలుగు వేలమంది హతులైనారు, ఖరుడు కూడా చనిపోయాడు అని మాత్రమే పలికాడు.

ఈ మాటలు విన్న వెంటనే రావణుడి కళ్ళు కోపంతో అరుణిమను సంతరించుకున్నాయి.

భయంతో కంపించిపోయే అకంపనుడు రావణుడి ముందు నిలుచుని ప్రభూ జనస్థానంలో మనవారందరూ చంపబడ్డారు. నేను మాత్రమే ఎలాగో తప్పించుకొని రాగలిగాను... అని చెప్పగా విన్న రావణుడు క్రోధంతో... ఎవడు వాడు ఎచటివాడు నాచోటికి వచ్చి నన్నే ఎదిరించినవాడు, వాడికి పోగాలం దాపురించింది.

నాకు అపకారం చేసినవాడు ఇంద్రుడైనా, చంద్రుడైనా, విష్ణువైనా, జిష్ణువైనా, యముడైనా సరే సుఖంగా ఉండలేడు. నీకేమీ భయం లేదు అంత సాహసం చేసిన ధూర్తుడెవ్వడో నిర్భయంగా చెప్పు అని కోపోద్రిక్త స్వరంతో పలికాడు.

వాడు రాముడు! సింగపు తీవి, వృషభపు మూపు, గుండ్రంగా దీర్ఘంగా ఉండే భుజాలు, చూడటానికి గంభీరంగా ఉంటాడు. వాడు దశరథ కుమారుడట.

వాడు దూషణ, త్రిశిర, ఖరులను, మన పదునాలుగు వేలమంది సైన్యాన్నీ ఒక్కడే చంపివేశాడు ప్రభూ అని అంటున్న... అకంపనుడి మాటలు విన్న రావణుడు తోకతొక్కిన త్రాచులాగా బుస్సున లేచాడు.

నేడే వాడి అంతు చూస్తాను అని బయలుదేరాడు. అప్పుడు అడ్డు తగిలిన అకంపనుడు ప్రభూ! రాముడిని పరాక్రమంతో జయించడం శక్యం కాని పని, వానిని ఉపాయం చేత వంచించి చంపవలె.

అందుకు నాకు ఒక మార్గం తోస్తోంది. వానికి అందమైన భార్య ఒకతి ఉంది. ఆమెది అతిలోకసౌందర్యం.

ఆవిడ అతని ప్రాణం.

నీవుగానీ ఆవిడను అపహరించి తెచ్చితివా! అది చాలును అతను బలహీనపడటానికి. కృంగి, కృశించి, నశించిపోతాడు.

వాడిమాటలు విన్న రావణుడు వెంటనే ప్రశస్తమైన గాడిదలు పూన్చిన రథమెక్కి మారీచాశ్రమానికి బయలుదేరాడు.

రావణుని చూడగానే మారీచుడు ఎదురేగి ఆసనం, ఉదకం ఇచ్చి సత్కరించి, వచ్చిన పని ఏమిటి అని అడిగాడు.

మారీచుడా! నేను ఒక కార్యం నిమిత్తం నీ వద్దకు వచ్చాను, రాముని భార్యను అపహరించాలి.

అందుకు నీ సహాయం కావాలి అన్నాడు.

ఆ మాట వింటూనే ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు మారీచుడు. నీకు ఈ సలహా ఇచ్చిన వెధవ ఎవడు?

వాడు నీకు మిత్రుడి రూపంలో ఉన్న శత్రువు.

సమస్త రాక్షస జాతిని నాశనం చేయాలని వాడు సంకల్పించుకొని నీకు ఈ సలహా ఇచ్చాడు. తక్షకుడి నోటినుండి కోరలు పీకమని నిన్ను ప్రేరేపించిన వాడు ఎవ్వడు.

రాముడనే మదగజాన్ని పట్టాలనుకొంటున్నావు !

ఆయన నిదురించే సింహం, రాముడు అనే పాతాళలోకంలోకి ఎందుకు జారిపడతావు? అందులో ధనుస్సే పెనుమొసలి, ఆయన భుజముల వేగమే బురద, ఆయన శరాలే ఉత్తుంగ తరంగాలు, యుద్ధమే జలప్రవాహం.

ఎందుకు నీ అంతట నీవే మునిగిపోవాలనుకుంటున్నావు.

నా మాటవిని లంకకు తిరిగి వెళ్ళు, నీ భార్యలతో క్రీడించి సుఖంగా ఉండు, ఎందుకు లేనిపోని తలనొప్పి తెచ్చి పెట్టుకుంటావు.. అని హితవు పలికిన మారీచుని మాటలు విని, ఆ ప్రయత్నం మానుకొని లంకకు తిరిగి వెళ్ళాడు రావణుడు.

# సునీతా ప్రస్థానం స్ఫూర్తిదాయకం



మానవాళి చరిత్రలో బుధవారం తెల్లవారుజామున గొప్ప చారిత్రక ఘట్టం ఆవిష్కృతమయింది. 9 నెలల ఉత్కంఠకు తెరపడింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 8 రోజుల పాటు ఉండడానికి మరో వ్యోమగామి విల్మోర్‌తో కలిసి వెళ్లిన సునీతా విలియమ్స్ 9 నెలల పాటు అక్కడే చిక్కుకుపోయి, ఎట్టకేలకు బుధవారం భూమికి సురక్షితంగా చేరుకున్నారు. వారిద్దరితో పాటు మరో ఇద్దరు వ్యోమగాములను తీసుకొచ్చిన డ్రాగన్ క్యాప్సూల్ భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున అమెరికాలోని ఫ్లోరిడా తీరానికి చేరువలో సాగర జలాల్లో సురక్షితంగా దిగడంతో ప్రపంచమంతా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. 17 గంటల పాటు సాగిన ఈ ప్రయాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలు ఆసక్తికరమే అయినా వాటికిమించి మనం తెలుసుకోవాల్సిన అంశాలు మరికొన్ని ఉన్నాయి.

ముఖ్యంగా సవాళ్ళు ఎదురయినప్పుడు నిబ్బరం కోల్పోకుండా, మనోధైర్యంతో ఉండాలనే పాఠాన్ని సునీతా విలియమ్స్ ద్వారా నేర్చుకోవచ్చు. 9 నిమిషాల పాటు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోతేనే సమస్య ఎక్కడుందో ఆలోచించకుండా అదే పనిగా హారన్లు మోగిస్తూ తీవ్రంగా అసహనం వ్యక్తం చేసే వారిని మనం నిత్యం చూస్తుంటాం. అలాంటిది 9 నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుపోయినా, ఎంతో ఓర్పుతో వేచి చూసిన సునీతా విలియమ్స్ నుంచి యువత చాలా నేర్చుకోవాలి. ఆమెను స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలి. ఈ 9నెలల పాటు ఆమె ఊరికినే కాలం గడిపేయలేదు. సహచర వ్యోమగాములతో కలిసి ప్రయోగాల్లో పాలుపంచుకున్నారు. స్పేస్ వాక్ చేసి అంతరిక్ష కేంద్రానికి అవసరమయిన మరమ్మతులు చేశారు. సుదీర్ఘ గంటల పాటు స్పేస్ వాక్ చేసిన వ్యోమగామిగా రికార్డు సృష్టించారు.

మనసులో మాట 37

సురక్షితంగా భూమిపైకి చేరుకోవడం ఒక ముఖ్యమైన ఘట్టమే కానీ, ఆమె ఎదుర్కోవాల్సిన సమస్యలు ఇంకా చాలా ఉన్నాయి. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు. అంతరిక్షంలో భూమిపై ఉన్నట్లు గురుత్వాకర్షణ శక్తి ఉండదు. భూమి గురుత్వాకర్షణ శక్తికి తగ్గట్లుగా లక్షల సంవత్సరాలుగా మన శరీర వ్యవస్థ అభివృద్ధి చెందింది. గురుత్వాకర్షణ శక్తిని అధిగమించి కదలడానికి మన కండరాలు, ఎముకలు దృఢంగా రూపుదిద్దుకుంటాయి. కణజాలం అభివృద్ధి, వాటి క్షీణత కూడా ఇక్కడి గురుత్వాకర్షణ శక్తికి తగ్గట్లుగానే ఉంటుంది. అంతరిక్షంలో మన శరీరం సునాయసంగా తేలుతూ ఉంటుంది. గుంజి ఉంచే శక్తి ఏమీ అక్కడ ఉండదు. అందువల్ల ఎముకలు, కండరాలు దృఢంగా ఉండాల్సిన అవసరం ఉండదు. దాంతో క్షీణించే కణజాలం క్షీణిస్తున్నా కొత్త కణజాలం వేగంగా వృద్ధి చెందదు. ఇటువంటి శారీరక పరిస్థితుల్లో సునీతా విలియమ్స్ భూమికి తిరిగొచ్చారు. ఇదే కాదు.. శరీరం అదుపు తప్పి పడిపోకుండా చెవుల్లో ఉండే సంతులన వ్యవస్థ, రక్త ప్రసరణ, జీర్ణ వ్యవస్థ ఇలా అన్ని రకాల వ్యవస్థలు ప్రభావితమై ఉంటాయి. ఇవన్నీ సాధారణ స్థితికి చేరుకోవడానికి వ్యోమగాములకు హ్యూస్టన్‌లోని ప్రత్యేక ఆసుపత్రిలో 45 రోజుల పాటు పర్యవేక్షణలో ఉండాల్సి ఉంటుంది. చిన్న ఆరోగ్య సమస్యకే కుంగిపోయేవారు, మొత్తం శరీర వ్యవస్థే అసాధారణ స్థితిలోకి వెళ్లిపోయినా ధైర్యంగా నిలబడిన సునీతా విలియమ్స్, ఇతర వ్యోమగాముల నుంచి ప్రేరణ పొందాలి. చిన్న చిన్న సమస్యలకే కుంగిపోయే యువతరం ఆమె మనోనిబ్బరం చూసి ప్రేరణ పొందాలి. అనుకోని సవాళ్ళు ఎదురయితే ఆ పరిస్థితిని తట్టుకుని ఎలా నిలబడాలో ఆమెను చూసి స్ఫూర్తిని పొందాలి. భూమికి నాలుగు వందల కిలోమీటర్ల ఎత్తులో ఉన్న అంతరిక్ష పరిశోధన కేంద్రం నుండి వాళ్ళు మనకు భూమి ఎలా ఉందో చూపించారు. ఈ సువిశాల విశ్వంలో మన భూగోళం ఎంత చిన్నదో, మళ్లీ ఆ చిన్న భూగోళంపై మనం ఉన్న ప్రాంతం ఎంత చిన్నదో హృదయం లోతుల్లోంచి అర్థం చేసుకుంటే చిన్న చిన్న సమస్యలకే పెద్ద పెద్ద యుద్ధాలు చేయాలన్న ఆలోచన రాదు.

సునీతా విలియమ్స్ తండ్రి దీపక్ పాండ్య గుజరాత్‌కి చెందినవారు. తల్లి బోనీ జలోకర్ స్లోవేకియా దేశస్తురాలు. సునీత వయసు ప్రస్తుతం 58 ఏళ్లు. యునైటెడ్ నేషన్స్ నావల్ అకాడమీ నుంచి 1987లో ఫిజికల్ సైన్స్‌లో డిగ్రీని పొందారు. ఆ తర్వాత ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్ డిగ్రీని పొందారు. 1998లో తొలిసారి సునీతను వ్యోమగామిగా నాసా ఎంపిక చేసింది. ఈ అంతరిక్ష ప్రయాణానికి ముందు, ఆమె రెండు స్పేస్ మిషన్లను చేపట్టారు. 2024 జూన్ 5న బోయింగ్ సంస్థకు చెందిన స్టార్ లైనర్ వ్యోమనౌకలో సునీతా విలియమ్స్, విల్మోర్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. వెళ్లేటప్పుడే ఆ వ్యోమనౌకలో ఇంధనంగా వాడే హీలియం లీక్ అయి సమస్య ఎదురైంది. తిరిగి వచ్చేటప్పుడు ప్రమాదం జరగవచ్చని శాస్త్రవేత్తలు భావించడంతో వ్యోమనౌక వారిని తీసుకురాలేదు. స్పేస్ ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ 'ఫ్రీడమ్'ను సిద్ధం చేసి పంపడానికి 9 నెలలు పట్టింది.



ఈ ఉత్కంఠభరిత ప్రయాణమే కాదు.. ఏ ప్రయాణం నుంచైనా మనం నేర్చుకోవాల్సింది ఏమిటంటే.. మన జీవితం ఒక ప్రయాణం. పుడుతూ పుడుతూ ఏమీ తీసుకురాము. పోతూ పోతూ ఏమీ తీసుకుపోము. మన ప్రయాణం ముగిసిన తర్వాత పదిమందీ మన గురించి మంచిగా చెప్పుకునేలా జీవించాలి!

తుమ్మల బాల గంగాధర్ తిలక్

# చింతలదేవి ప్రాజెక్టు అభివృద్ధిపై..గళమెత్తిన కాకర్ల



నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజక వర్గం కొండాపురం మండలం చింతల దేవి పంచాయతీలో ఏర్పాటు చేసి ఉన్న జాతీయ కామదేను బ్రీడింగ్ సెంటర్ అభివృద్ధిపై ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అసెంబ్లీలో తమ గళం వినిపించారు. ఈనెల 17న జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఆయన మాట్లా డుతూ, ఎంతో చరిత్ర కలిగిన జాతీయ కామదేను ప్రాజెక్టు అభివృద్ధికి ప్రభుత్వం సహాయం అందించాలని కోరారు. గతంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహకారంతో 2015లో జాతీయ కామ ధేను ప్రాజెక్టుగా రూపాంతరం చెంది అంచలంచెలుగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక, దానిని పట్టించుకునే నాథుడే లేక ఈ ప్రాజెక్టు మరుగున పడిందన్నారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టుకు త్రాగునీటి కొరత ఉందని తెలిపారు. అందుకు, మంత్రి కే. అచ్చంనాయుడు సమాధానం చెబుతూ, దేశంలో రెండు కామధేను ప్రాజెక్టులు ఉండగా ఒకటి ఆంధ్రప్రదేశ్‌లోని చింతల దేవి వద్ద ఏర్పాటు చేశారన్నారు. నిపుణుల బృందం పరిశీలన అనంతరం ఆ ప్రాజెక్టు అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ప్రాజెక్టులో తాగునీటి సమస్యను నివారించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

## విదేశీ పెట్టుబడులు ఆకర్షించేందుకు

# కేంద్రం తీసుకుంటున్న చర్యలేమిటి?

### లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలు



దేశంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియ జేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈనెల 17న లోక్‌సభలో ఆయన పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. పీడబ్ల్యూసీ సర్వే ప్రకారం దేశం ప్రపంచంలోనే 5వ అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందన్న విషయం వాస్తవమేనా అని ఆయన అడిగారు. అయితే 2020లో 4వ స్థానం నుండి 2022లో 5వ స్థానానికి, 2023లో 9వ స్థానానికి పడిపోయిన కారణంగా ప్రభుత్వం ఈ స్థానాన్ని పదిలం చేసుకోవడానికి విధానపరంగా తీసుకుంటున్న చర్యలు, అదనపు మూలధన వ్యయం, దేశీయ డిమాండ్ ఈ విషయంలో ఎంతవరకు సహాయపడతాయో తెలియజేయాలని కోరారు. అందుకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. పీడబ్ల్యూసీ 27వ వార్షిక గ్లోబల్ సర్వే ప్రకారం, భారతదేశం ప్రపంచంలో 5వ అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా మారిందన్నారు. అయితే, ప్రైవేట్ సంస్థలు, రేటింగ్ ఏజెన్సీలు, ఇతర ప్రపంచ సంస్థలు ఎప్పటికప్పుడు భారత ఆర్థిక వ్యవస్థపై తమ సొంత అంతర్గత పరిశోధనలను ప్రచురిస్తాయని, భారత ప్రభుత్వ అభిప్రాయాన్ని సూచించవని తెలియజేశారు. భారతదేశంలో దేశ, విదేశీ పెట్టుబడులను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగా మేక్ ఇన్ ఇండియా, స్టార్ట్-అప్ ఇండియా, పీఎం గతిశక్తి, నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రామ్, ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ని ప్రోత్సహించడం, నేషనల్ సింగిల్ విండో సిస్టమ్, ఇండియా ఇండస్ట్రియల్ ల్యాండ్ బ్యాంక్, ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్, ఎఫ్‌డీఐ విధానం సరళీకరణ వంటివి దేశంలోకి పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడానికి ఉపకరిస్తాయన్నారు. అదేవిధంగా, కేంద్ర బడ్జెట్-2025లో బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 74 శాతం నుండి 100 శాతానికి పెంచామన్నారు. కేంద్ర బడ్జెట్ 2025 ప్రకారం మొత్తం మూల ధన వ్యయం 2024-25లో రూ.10.18 లక్షల కోట్లు కాగా, ఇది 2023-24లో రూ.9.49 లక్షల కోట్లుగా ఉందన్నారు. పన్నుల చర్యలతో సహా దేశీయ డిమాండ్‌ను పెంచడానికి, తద్వారా దేశీయ వినియోగం, పొదుపులు మరియు పెట్టుబడులను పెంచ డానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టబడ్డాయని వివరించారు

# అమరజీవి విగ్రహం ఏర్పాటు..హర్షదాయకం!

### సీఎం ప్రకటనతో ఆర్యవైశ్యుల్లో సంతోషం



ఆంధ్ర రాష్ట్ర సాధనకు అసువులు బాసిన త్యాగధనుడు.. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు స్మారకంగా, ఆ మహనీయుడు 58 రోజులు చేసిన ఆమరణదీక్షకు గుర్తుగా రాజధాని అమరావతిలో 58 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటుచేస్తామని, అది కూడా ఏడాదిలోపే నిర్మిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల ఆర్యవైశ్యవర్గాల్లో సంతోషం వెల్లు వెత్తుతోంది. నెల్లూరుజిల్లాలోని పడమటిపల్లెలో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములి నివాసాన్ని ఆయన స్మారక మ్యూజియంగా రూపు దిద్దుతామని, ఆ గ్రామంలో ఆధునిక వసతులతో కూడిన ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేస్తామని శ్రీ పొట్టి శ్రీరాములు జయంతిరోజున ముఖ్యమంత్రి ప్రకటించడం కూటమి ప్రభుత్వానికి అమరజీవిపై ఉన్న గౌరవభావానికి నిదర్శమని ఆర్యవైశ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 18న నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలోని అవోపా కార్యాలయంలో పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు మాట్లాడుతూ, అమరజీవి పేరుతో స్మృతివనం ఏర్పాటు చేస్తామని కూడా సీఎం చెప్పారని అంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి ప్రభుత్వానికి ఆర్యవైశ్య మహాసభ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తున్నదంటూ ధన్యవాదాలు చెప్పారు. ఆర్యవైశ్య మహాసభ చీఫ్ ఆర్గనైజర్ కోట గురుబ్రహ్మం, ప్రధాన కార్యదర్శి శేగు షణ్ముఖరావు, ఉపాధ్యక్షులు మెంటా వీరబ్రహ్మం గుప్తా, ఆర్యవైశ్య ప్రముఖులు దర్శి హరికృష్ణ, భవనాసి సురేష్, శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సెక్రటరీ చిరంజీవి, కోశాధికారి జనార్ధన్, ఎంపీ ఆంజనేయులు, కమిటీ మెంబర్లు రాజా హజరత్, కోటా మధుసూదనరావు, దుగ్గిశెట్టి అశోక్,ర వడమాల రమేష్, దగ్గుమాటి మురళీకృష్ణ, వాయుగండ్ల బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# జాతరకు ముస్తాబైన తూర్పుకనుపూరు



గూడూరు డివిజన్, చిల్లకూరు మండలంలో ఘనంగా జరగబోయే శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ జాతరకు తూర్పుకనుపూరు ముస్తాబవుతోంది. ఈ నెల 16వ తేదీ మహోత్సవ ఆహ్వాన పత్రికను గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్‌కుమార్, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం నందు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, ఈవో నవీన్‌కుమార్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 25వ తేదీ శ్రీ అమ్మవారికి దిష్టి తీర్పు, అమ్మవారి నిజపాద దర్శనం, గొప్ప నాదస్వర కచేరి, సింహవాహన సేవలు ఉంటాయి. 26వ తేదీ పూలంగిసేవ, శ్రీ పోలేరమ్మ అమ్మవారి నిలుపు, ఉయ్యాలసేవ, 27వ తేదీ అమ్మవారికి బంగారు చీర అలంకరణ, ఉచిత ప్రసాద వితరణ ఉంటాయి. 28వ తేదీ శ్రీ పోలేరమ్మను వెళ్ళనంపు ఉత్సవం జరుగుతుంది.

# తప్పుడు సమాచారంపై ఎమ్మార్వో ఫిర్యాదు

గూడూరు పట్టణం, నెహ్రూనగర్‌కు చెందిన మొగిరాల నాగేశ్వరరావు అనే వ్యక్తి తనకి తప్పుడు సమాచారం ఇచ్చి కుటుంబసభ్యుల ధృవీకరణ పత్రానికి సచివాలయంలో దరఖాస్తు చేశాడని, కుటుంబ సభ్యులు మొత్తం వివరాలు తెలపకుండా రెవెన్యూ ఇన్స్పెక్టర్ విచారణ సమయంలో, నోటరీ అఫిడవిట్లో తప్పుడు వివరాలు తెలిపాడని పేర్కొంటూ ఎమ్మార్వో ఒకటో పట్టణ ఎస్సై తిరుపతయ్యకు ఫిర్యాదు చేశారు. దీంతో మొగిరాల నాగేశ్వరరావుపై చీటింగ్ కేసు నమోదు చేశామని ఎస్సై తెలియజేశారు.

# వైభవంగా చక్రస్నానం



గూడూరు పట్టణంలోని శ్రీ అళఘునాథస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇటీవల స్వామి అమ్మవార్లకు విశేష అలంకరణ ఏర్పాటు చేసి వసంతోత్సవం, మాడవీధి ఉత్సవం నిర్వహించారు. పాలు పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనం అనంతరం పుష్కరిణిలో చక్రస్నానం, మహా పూర్ణాహుతి, పూజా కార్యక్రమాలను అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆర్టీసీ డిపో కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 1/2019 సర్క్యులర్ విధిగా అమలు చేయాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు ఇటీవల గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. డిపో మేనేజర్ కార్మికులను, అసోసియేషన్ నాయకులను దురుసుగా, అవమానకరంగా మాట్లాడే వైఖరి మానుకోవాలని డిపో ప్రెసి డెంట్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. డిపో ఛైర్మెన్ భాష, సెక్రెటరీ శ్రీనివాసులు, క్యారేజీ సెక్రెటరీ ప్రవీణ్, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య, ట్రెజరర్ గౌస్, రమేష్, సుధాకర్, శేఖర్, సందాని, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



## బ్రాహ్మణ భవనంలో

# పంచాంగ పుస్తకావిష్కరణ


ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమైక్య గూడూరు శాఖ ఆధ్వర్యంలో ఇటీవల బ్రాహ్మణ భవనంలో నెల్లూరు వాస్తవ్యులు, పండితులు ఆలూరు శిరోమణి శర్మ, వారి ధర్మపత్ని చేతుల మీదుగా పంచాంగ పుస్తక ఆవిష్కరణ జరిగింది. శిరోమణి శర్మ మాట్లాడుతూ బ్రాహ్మణులందరూ కూడా ఉగాది రోజున శ్రీ విశ్వావసునామ సంవత్సర పంచాంగం మీ ఇంట్లో చదవాలని కోరారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఆనిమెళ్ళ శివకుమార్, సెక్రెటరీ చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారి విద్యాలలిత, దూబగుంట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాతా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు



గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలోని అరుంధతి వాడలో వెలసియున్న మాత పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ స్తులు గత మూడు రోజులుగా చద్ది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 18న పుష్పాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతగా ఎం.ఆర్.పి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవిందు శంకరయ్య వ్యవహరించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# కళ్యాణ వైభవం...!




వింజమూరు వాస్తవ్యులు దాట్ల వెంకటసుధాకర్‌రెడ్డి - శారదల కుమార్తె
**నమ్రుత రెడ్డి - శ్రీతేజరెడ్డి** (శ్రీ సత్యసాయి జిల్లా వాస్తవ్యులు యనమలదొడ్డి రాజశేఖర్‌రెడ్డి - కుసుమకుమారిల కుమారుడు)ల వివాహం మార్చి 15వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది.
నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనెలు.

# ఓబీసీ మహిళల రిజర్వేషన్‌లకి కృషిచేస్తాం

## - రాజ్యసభ సభ్యులు బీఎంఆర్



ఓబీసీ మహిళల రిజర్వేషన్‌కి కృషిచేస్తామని రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు (బీఎంఆర్) చెప్పారు. ఈనెల 18న న్యూఢిల్లీలో జరిగిన అఖిల భారత ఓబీసీ మహిళా సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్లమెంటులో చర్చ జరుగుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లులో 33శాతం మహిళలకు కేటాయించే సీట్లలో ఎస్సీ మరియు ఎస్టీ మహిళలకు రిజర్వేషన్లను బిల్లులో చూపించారని, కానీ ఓబీసీ కులాలకు చెందిన మహిళలకు రిజర్వేషన్లు బిల్లులో పొందుపరచలేదని అన్నారు. అందువల్ల ఓబీసీ మహిళలకు చట్టసభలలో ప్రాతినిధ్యం తగ్గుతుందని చెప్పారు. ఈ విషయంపై పార్లమెంటులో ఓబీసీ ఎంపీలతో వెళ్ళి ప్రధానమంత్రి నరేంద్రమోడీని కలిసి ఓబీసీ మహిళల రిజర్వేషన్‌కి కృషి చేస్తామని ఆయనన్నారు.

# వాట్సాప్ గవర్నెన్స్‌తో.. పారదర్శక పాలన

## - ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందిస్తున్న సీఎం దూరదృష్టిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రస్తుతించారు. ఈనెల 18న ఆమె అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడుతూ వాట్సాఫ్ గవర్నెన్స్‌తో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పరిపాలనలో పారదర్శకతతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు చేస్తున్న కృషి గొప్పదన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై గ్రామస్థాయిలో సచివాలయాల్లో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఎమ్మెల్యేకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పిస్తే క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేసేందుకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

# మార్చి 30న..సింహపురి ఉగాది మహోత్సవం



నెల్లూరులోని సింహపురి ఉగాది ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మార్చి 30న ఉగాది మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు సమాయత్తమవుతున్నారు. నెల్లూరు నగరంలోని శివాజీ సెంటర్ వద్దనున్న టీవీఎస్ కళ్యాణ సదన్‌లో ఈనెల 19న సింహపురి ఉగాది ఉత్సవ సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, శివాజీ సెంటర్ శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం–టీవీఎస్ కళ్యాణ సదన్ సంయుక్తంగా ఉగాది ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలుగు సంప్రదాయాలను విశిష్టతను రేపటి తరానికి అందిస్తూ విశ్వావసు నామ సంవత్సర ఉగాది మహోత్సవాలు మార్చి 30న సంప్రదాయబద్ధంగా, ఆధ్యాత్మిక సంబరంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం, కార్యక్రమ వివరాలతో గోడ పత్రికలు ఆవిష్కరించారు. కార్యనిర్వహక అధ్యక్షులు..టీవీఎస్ కళ్యాణ్ సదన్ మేనేజింగ్ ట్రస్టీ దేశభట్ల మణిరత్నం మాట్లాడుతూ, ఆ రోజున ఉదయం ఏడు గంటల నుండి గోపూజ, గణపతి పూజలు, సాయంత్రం 4 గంటలకు భజన మండళ్ళచే కోలాట ప్రదర్శనలు, శాస్త్రీయ సంగీత కచేరీలు ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటలకు పంచాంగ శ్రవణం, పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య సంస్థానాధీశ్వరులు శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి వారిచే అనుగ్రహ భాషణం, ఉగాది ఆశీర్వచనం జరుగుతాయని, భక్తులందరికీ ఉగాది ప్రసాద వినియోగం జరుగుతుందని తెలిపారు. అధ్యక్షులు బిఎస్ రంగరాజన్ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా, కార్యక్రమ ముఖ్య సమన్వయకర్త పి.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సింహపురి ఉగాది ఉత్సవ సమితి నూతన కార్యవర్గ కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారులుగా ఆడిటర్ సీవీ సుబ్రహ్మణ్యం, పిట్టి సత్య నాగేశ్వరరావు, అధ్యక్షులుగా బిఎస్ రంగరాజన్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా టీవీఎస్ సత్రం మేనేజింగ్ ట్రస్టీ దేశభట్ల ఫణిరత్నం, ప్రధాన కార్యదర్శులుగా వి.హర్షవర్ధన్, జగన్‌ల తోపాటు పలువురు ప్రత్యేక ఆహ్వానితులుగా, కమిటీ సభ్యులుగా పని చేస్తారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బి.నాగలక్ష్మి, ఉమాదేవి,జయలక్ష్మి, నీలి రాఘవ, కె.వి. సుబ్రహ్మణ్యం, భాస్కర్‌రావు, బాలసుబ్రహ్మణ్యం, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# 'పవనపుత్ర శతకం'.. నెల్లూరీయునికి అంకితం!



తెలంగాణలోని గద్వాల జిల్లాకు చెందిన తెలుగు పండితులు, ఉత్తమ ఉపాధ్యాయులు..సామాజిక సేవా పరాయణులు..నాయుడుగారి జయన్న సామాజిక అంశాలతో 101 ఆటవెలది పద్యాలతో రచించిన 'పవనపుత్ర శతకం'ను ఇటీవల సికింద్రాబాద్‌లో ఆవిష్కరించారు. ఆ శతకాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ అవధాని కోట రాజశేఖర్‌కి అంకితం ఇవ్వడం విశేషం. అల్లూరు రామకృష్ణ విద్యాసంస్థల ఉపాధ్యక్షులు, హోటల్ మినర్వాగ్రాండ్ డైరెక్టర్ మేడా రఘురామిరెడ్డి సౌజన్యంతో జరిగిన ఈ ఆవిష్కరణోత్సవంలో, ఆ శతకాన్ని, నెల్లూరుజిల్లా అల్లూరు వాస్తవ్యులు మేడా రామసుబ్బారెడ్డి, అల్లూరీయులు.. ప్రస్తుతం విశాఖ వాస్తవ్యులైన మేడా మస్తాన్‌రెడ్డి ఆవిష్కరించారు. సభాధ్యక్షులు పూదత్తు భాస్కర్, సమన్వయకర్త అనిమోని మహేందర్, గ్రంథ సమీక్షకులు డా.భాను ప్రకాశ్, విశిష్ట అతిథి నివర్తి మోహన్‌కుమార్, అల్లూరు రామకృష్ణా విద్యాసంస్థల సిబ్బంది, పలు ప్రాంతాల సాహితీవేత్తలు, కవితాభిమానులు పాల్గొన్నారు.



# సై అంటున్న సాయిరెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

అక్రమాలను ఒక్కొక్కటిగా బయటపెట్టే పనికి శ్రీకారం చుట్టినట్లు రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందులో భాగంగానే మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కాకినాడ పోర్టులో అక్రమంగా వాటాల కొనుగోలు కేసులో విక్రాంత్‌రెడ్డి కీలకపాత్ర పోషించారంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. పైగా రాజ్యం, రాజు, కోట, కోటరీ, మారువేషం అంటూ తనదైన ట్వీట్‌తో జగన్ మాయా సామ్రాజ్యాన్ని, అందులోని వేగుల వ్యవహారశైలిని సోషల్ మీడియా సాక్షిగా కళ్ళకుకట్టారు.

## కసిరెడ్డిపై కసితీరా ఆరోపణలు

దేశంలో ఏ ముఖ్యమంత్రి నియమించుకోని విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో 100 మందికి పైగా సలహాదారులను నియమించుకుని, వారికి ఆయా శాఖల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడే బాధ్యతలను అప్పగించారంటూ అప్పట్లోనే ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోశాయి. ఈక్రమంలోనే ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సలహాదారుగా పదవి వెలగబెట్టిన కసిరెడ్డి రాజశేఖరరెడ్డి, మద్యం విక్రయాల్లో అవినీతికి కొత్త బ్రాండ్‌గా అవతరించారని, తద్వారా కనిపించని అక్రమాలకు కేరాఫ్‌గా మారి సరికొత్త ట్రెండ్ సృష్టించారని విజయసాయిరెడ్డి తాజాగా ఆరోపించారు. పాత మద్యం బ్రాండ్‌లను గత ప్రభుత్వం పూర్తిగా పక్కనబెట్టి కమీషన్ల కోసం కొత్తకొత్త బ్రాండ్‌లను మద్యం ప్రియులకు విక్రయించారని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు గత ప్రభుత్వంలో రూ.18 వేల కోట్లు నష్టం వాటిల్లిందని తెలుగుదేశం నాయకులు ఆరోపిస్తున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం మద్యం కుంభకోణంపై సిట్ దర్యాప్తునకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఇప్పటికే పలువురు తమ వాగ్మూలాలను సైతం సిట్ అధికారులకు ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తాజాగా విజయసాయిరెడ్డి మద్యం కుంభకోణంలో కసిరెడ్డి ముఖ్యపాత్ర పోషించారని, ఈ వ్యవహారంలో క్రెడిట్ అంతా అతడికే దక్కుతుందని వ్యంగ్యాస్త్రాలు సంధించడం గమనార్హం.

## వాటాల విక్రయంలో బాబాయ్ కొడుకుదే బాధ్యత..

కాకినాడ పోర్టులో వాటాల విక్రయం కోసం అడ్డగోలు వ్యవహారాలు నడిపింది, కేవీరావ్‌తో సంబంధాలు నెరిపింది జగన్ బాబాయ్ కుమారుడు విక్రాంత్‌రెడ్డి మాత్రమే అంటూ విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. నిజానికి కేవీరావ్‌తో తనకు ముఖపరిచయం మాత్రమే ఉందని, అరబిందో సంస్థ ఆర్థిక కార్యకలాపాల్లో తనకు ఎలాంటి ప్రమేయం లేదని తేల్చిచెప్పారు. సీఐడీ అధికారులు తనపై తప్పుడు కేసు నమోదు చేశారని, కేవీరావ్, వై.వీ.సుబ్బారెడ్డి మంచి మిత్రులని, అలాంటప్పుడు కేవీరావ్‌కి విక్రాంత్ రెడ్డిని పరిచయం చేయాల్సిన అవసరం తనకేం ఉంటుందని ఎదురు ప్రశ్నించారు. అరబిందో సంస్థ నుంచి కోట్లాది రూపాయలు కేవీరావ్‌కి బదిలీ అయిన విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదని వెల్లడించారు. ఈ విషయంలో అంతిమ లబ్ధిదారు మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనే తరహాలో సీఐడీ అధికారులు తనపై ప్రశ్నలవర్షం కురిపించారని, అయితే ఈ విషయంలో ఆయనకు సంబంధం ఉండకపోవచ్చు అంటూనే, తనకు తెలిసిన విషయాలను మాత్రమే వివరించానంటూ బాంబు పేల్చడం కొసమెరుపు. అలాగే జగన్‌పై నమోదైన 11 సీబీఐ కేసుల్లోనూ, 10 ఈడీ కేసుల్లోనూ తనను ఏ-2గా చేర్చినట్లే, కాకినాడ పోర్టులో అక్రమంగా వాటాల కొనుగోలు కేసులోనూ ఏ-2గా చేర్చారని కాబట్టి, అధికారులు చేర్చారంటూ చమత్కరించడం గమనార్హం.

## మనసు విరిగిందంటూ... మీడియా ముందు

వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రారంభమైనప్పటి నుంచి అధినేతకు చేదోడు వాదోడుగా నిలిచానని, కేసులు ఎదుర్కొన్నానని అయినా ఆంధ్రా శశికళ (సజ్జల టీమ్) తనకు, జగన్‌కు మధ్య అభిప్రాయ బేధాలు సృష్టించి చివరికి వాటిని పూడ్చలేనంతటి అఖాతంగా మార్చివేశారని మీడియా సమావేశంలో ఆరోపించారు. ఈ క్రమంలో గత మూడున్నరేళ్ల నుంచి పార్టీలో అనేక అవమానాలు ఎదుర్కొన్నానని, నాపై పితూరీలు చెప్పిన వారు అంచెలంచెలుగా పైకి ఎదిరాగారని విమర్శించారు. కోటరీ నాయకులకు ఆర్థికంగానో, మరో రకంగానో మెప్పిస్తేనే జగన్ అపాయింట్‌మెంట్ దక్కే దుస్థితి పార్టీలో నెలకొందని అన్నారు. కోటరీని పక్కన పెట్టకుంటే పతనం కాక తప్పదని తేల్చిచెప్పారు.

## ట్వీట్ పేరుతో.. అధినేతకు హితబోధ

పూర్వకాలంలో మహారాజులు కోటల్లో ఉండేవారని, వారి చుట్టూ కోటరీ ఉండేదని, రాజ్యంలో ప్రజలు ఎలా వున్నా కోటరీ మాత్రం ఆహా రాజా, ఓహో రాజా అంటూ భజన చేస్తుందని, తద్వారా రాజు కళ్ళకు గంతలు కట్టి తమ ఆటలు సాగించుకునేదని, చివరికి వారిని నమ్మి రాజుతో పాటు రాజ్యం కూడా పోయేదని వ్యాఖ్యానించారు. అయితే తెలివైన రాజు మాత్రం మారు వేషంలో ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకుని రాజ్యాన్ని కాపాడుకునేవాడని పేర్కొన్నారు. రాజు బాగుపడాలంటే ప్రజల్లోకి రావాలని, ప్రజల మనసెరిగి నడుచుకోవాలని లేదంటే కోటరీ వదలదని, కోట కూడా మిగలదని హెచ్చరించారు. అధినేత మారకుంటే మరుగునపడిపోవడం ఖాయమంటూ తన ఆక్రోశాన్ని విజయసాయిరెడ్డి వెళ్ళగక్కారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఎప్పుడో చెప్పిన 'లాయర్'!

ఏ-1, ఏ-2 మధ్య సంబంధాలు దెబ్బతినడానికి, గత ఎన్నికల్లో ఊహించని పరాభవానికి జగన్‌మోహన్‌రెడ్డిని ఆవరించిన కోటరీయే కారణమని, ఈ విషయాన్ని గుర్తించకుండా గుడ్డిగా కోటరీ నాయకులను నమ్మి జగన్ నట్టేట మునిగినా, తన తీరును మాత్రం మార్చుకోవడం లేదని, తద్వారా సగటు వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆవేదనను అధినేత గుర్తించడం లేదని 'లాయర్' ఎప్పుడో హెచ్చరించింది. జగన్ తన ధోరణిని మార్చుకోకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని సూచించింది. నాయకులు ప్రజల్లోనే పుడతారని, ప్రజల్లోనే ఎదుగుతారని ఆ విషయాన్ని జగన్ మరిస్తే, జనం ఆయన్ని మరిచిపోయే రోజు వస్తుందని జోస్యం చెప్పింది. దీనికి పరిష్కారం జగన్ చేతుల్లోనే ఉందని, తాడేపల్లి కోటను, శకుని లాంటి కోటరీ నాయకులను వదిలి జనంలోకి వచ్చి వారి ఆకాంక్షలను నెరవేర్చి వారి సమస్యల్లో తోడుగా నిలిచినప్పుడే భవిష్యత్ ఉంటుందని తేల్చిచెప్పింది. తాజాగా జగన్ ఆత్మగా చెలామణి అయిన విజయసాయిరెడ్డి కూడా నేడు అదే విషయాన్ని వెల్లడించడం విశేషం. ఏదేమైనా భజనపరులకంటే, బాధ్యతలు మోసేవారిని పక్కనపెట్టుకుంటేనే నాయకులు బాగుపడతారన్నది కాదనలేని నిజం. ఈ విషయాన్ని జగన్ ఎప్పటికైనా గుర్తిస్తారో లేదో కాలమే చెప్పాలి..!

## కూలిన వంతెన

దీపం ఆరిన తర్వాతే
తాపీగా ఇల్లు చక్కదిద్దుకొనే
ప్రయత్నం
కాలం చేజారిపోయాక
పరుగులుపెట్టి చేజిక్కించుకోవాలనే
ఆరాటం
సూర్యుడు చేజారిపోయాక
వెంటబడి వెలుగును పొందాలనే
తాపత్రయం
రెండు క్షణాలు కలిసే అద్భుతమైన
చోట ప్రణాళిక రచించలేని
అసమర్ధ పోరాటం
తెల్లారిపోయాక రోజు కాలిపోయాక
ఆకుల కోసం
వెంపర్లాడే వృథా ప్రయాస
ఓటు వేయాల్సిన చోట కాక
చేతు తెచ్చే చోట
తపనపడే తపస్సు
నిరంతరం కష్టాన్ని నమ్ముకోక
నిశ్చలంగా పనిచేసుకోక
అంతరాత్మను తప్పుదోవ పట్టించుకొనే
ఆత్మహత్య సదృశ్యం
తన్నుతాను దగా చేసుకొనే
సామాజికాంశంలో ఆరితేరిన
అరివీర భీకరత్వం
రేపు కోసం ఎప్పుడు
ఎదురుచూస్తూ నేటిని జారవిడచే
నిర్లిప్త మానవత్వం
చంచల స్వభావంతో చరించే
నదిలోని నీటిలా దారి తప్పి సంచరించే
గతి తప్పిన బాటసారి –
అవకాశాల్ని అందిపుచ్చుకోలేని
ఆత్మాశ్రయ ధోరణి లేని నిరుపేద
మానవుడు
మధ్య తరగతి మందహాస జీవుడు
మధ్యందిన మార్తాండుడు కాలేక
వెలవెలబోయి
కూలిపోయిన వంతెన!



చిన్ని నారాయణరావు
94402 02942

## విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ.. సీపీఎం ఆందోళన

పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలంటూ నెల్లూరు సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఈనెల నగరంలోని రామ్మూర్తినగర్ విద్యుత్ సెక్షన్ కార్యాలయం వద్ద ఈనెల 19న ఆందోళన జరిగింది. విద్యుత్ బిల్లుల్లో ట్రూఅప్ చార్జిల పేరుతో ప్రజలపై వేలకోట్ల భారం పడుతోందని, ఆ భారాన్ని ప్రభుత్వమే భరాయించాలని, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపేయాలని సీపీఎం నగర కమిటీ కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నాగేశ్వరరావు, సూర్యనారాయణ, ప్రసాద్, జాఫర్, ఫయాజ్ పాల్గొన్నారు.

## టూకీగా...



### గండిపాళెంలో.. గంగమ్మ తల్లి ఉత్సవాలు

ఉదయగిరి మండలం, గండిపాళెం గ్రామంలోని శ్రీ పోతురాజుస్వామి సమేత గంగమ్మతల్లి ఆలయంలో ఇటీవల మూడురోజులపాటు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ పాముల రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు.

### బిరదవోలులో రక్తదాన శిబిరం

పొదలకూరు మండలం బిరదవోలులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు బదుగు శ్రీనివాసులు, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఈనెల 17న రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఎస్ఐ హనీఫ్ ఈ శిబిరాన్ని ప్రారంభిస్తూ, రక్తదానం ఆవశ్యకతను వివరించారు. పలువురు దాతలు రక్తదానం చేశారు. గత నాలుగేళ్ళుగా గ్రామస్తుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

### చిన్నరాముడుపాళెంలో కోడిపందాలపై దాడులు

కావలి రూరల్ మండలం చిన్నరాముడుపాళెం పొలాల్లో కోడిపందాల స్థావరాలపై సీఐ రాజేశ్వరరావు ఆదేశాలతో కావలి రూరల్ ఎస్ఐలు తిరుమలరెడ్డి, బాజీబాబుల ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి ఒక కోడిపుంజును, 1080 రూపాయలను స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేశారు.

### పడుగుపాడులో ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన

కోవూరు మండలం పడుగుపాడులోని నేతాజీనగర్‌లో ఇటీవల ఇఓపిఆర్‌డీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామస్తులకు ప్లాస్టిక్ వ్యర్థాల పట్ల అవగాహన కలిగించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి గ్రామంలోని చెత్తాచెదారాన్నంతా పరిశుభ్రం చేశారు.

### అక్కంపేటలో రైతులకు సూచనలు

మనుబోలు మండలం అక్కంపేట గ్రామంలో ఈనెల17న తహశీల్దార్ సుబ్బయ్య ఆధ్వర్యంలో రైతులకు రైతుసేవా కేంద్రాలపై అవగాహన కలిగించారు. దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరకు విక్రయించుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి జహీర్, విఆర్‌ఓ మురళీధర్ పాల్గొన్నారు.

### ఎల్లాయపాళెంలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి

కొడవలూరు మండలం ఎల్లాయపాళెం జడ్పీ హైస్కూల్‌లోని టెన్త్ విద్యార్థులకు నార్త్‌రాజుపాళెం ఎస్‌బీఐ వారి సహకారంతో ఇటీవల పరీక్ష సామగ్రిని పంపిణీచేశారు. విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి, ఉత్తమస్థాయిలో ఉత్తీర్ణులు కావాలని వారు ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రామలింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### కావలిలో.. బీసీ బాలికల వసతిగృహం తనిఖీ

కావలి మునిసిపాలిటీ పరిధిలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఇటీవల జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాలను పరిశీలించి వసతుల గురించి ఆరా తీశారు. సిబ్బందికి సూచనలిచ్చారు.

### మనుబోలులో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

మనుబోలులో ఇటీవల ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, ఎంపీడీఓ జలజాక్షి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దంటూ గ్రామంలోని అంగళ్ల వద్దకు వెళ్లి అవగాహన కలిగించారు. సర్పంచ్ పద్మమ్మ, ఇఓపిఆర్‌డి నారాయణ, కార్యదర్శి గరుడయ్య తదితరులు పాల్గొన్నారు.

### నందిగుంటలో పట్టపగలే చోరీ

వింజమూరు మండలం నందిగుంట గ్రామంలోని షేక్ ఖాదర్‌బాషా ఇంట్లో ఇటీవల పట్టపగలే దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేనిసమయం చూసి, దొంగలు కిటికీ కమ్ములు కట్‌చేసి, బీరువాలో ఉన్న లక్షరూపాయలతో పాటు, 11 సవర్ల బంగారునగలు దొంగిలించుకుపోయారు.

# అజయ్ పుట్టినరోజు వేడుకలు



ఏపీ టిడ్కో ఛైర్మన్, జనసేన నాయకుడు వేములపాటి అజయ్ పుట్టినరోజు వేడుకలు ఈనెల 20న నెల్లూరులో జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఆనందోత్సవ సంబరంగా జరిగాయి. జనసేన నెల్లూరురూరల్ సమన్వయకర్త, జిల్లా కోర్ కమిటీ సభ్యులు కాకు మురళిరెడ్డి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి అందరికీ పంచారు. జనసేన పార్టీకి అంకితభావంతో అజయ్ కృషి చేస్తున్నారంటూ నాయకులు అజయ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. అనంతరం, మద్రాస్ బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న వినాయకస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. జనసేన నేతలు అజయ్‌తో పాటు, పవన్ కళ్యాణ్, నాగబాబు తదితరులంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ప్రార్థనలు చేశారు. జనసేన పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్, పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### చిరంజీవి యువత ఆధ్వర్యంలో...

అజయ్ పుట్టినరోజును నెల్లూరులోని చిరంజీవి యువత ఆధ్వర్యంలో నాయకులు సంతోషంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేద మహిళలకు, చీరలు పంపిణీ చేసి, నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పావుజెన్ని చంద్రశేఖర్‌రెడ్డి, హరిరెడ్డి, కరీం, సుధామాధవ్, కిషోర్, మహేష్‌శర్మ, మస్తాన్, మహిళా నాయకులు కస్తూరి, నందిని, ప్రసన్న, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతమ్మ చొరవతో.. నలుగురికి కంటి ఆపరేషన్లు



కోవూరు నియోజకవర్గం కొడవలూరుకు చెందిన నలుగురికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో ఇటీవల కంటి ఆపరేషన్లు చేయించారు. నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలను నిర్వహించారు. పేదలకు వైద్య సహాయం అందించడంలో చొరవ చూపిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి బాధితుల కుటుంబసభ్యులు తమ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

### 'గేట్' పరీక్షల్లో..

## ఎన్‌బికెఆర్ ప్రతిభ



దేశంలోని ఐఐటీలు, పలు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (జీఏటీఇ) 2025 పరీక్షల ఫలితాల్లో కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ మెకానికల్ విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తాచాటారు. నాల్గవ సంవత్సరం చదువుతున్న వడ్లపూడి దినేష్, చింతమాను మహేష్‌లు గేట్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్ పేపర్‌లో వరుసగా జాతీయస్థాయిలో 309 మరియు 597వ ర్యాంకులు, గేట్ ఇంజనీరింగ్ సైన్స్‌లో కురువ అశోక్ 939 ర్యాంకు సాధించాడని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి వారిని అభినందించారు. అదేవిధంగా గేట్ మెకానికల్ ఇంజనీరింగ్(ఎం.ఇ)లో చింతమాను మహేష్, కురువ అశోక్ 5061 మరియు 6790 ర్యాంక్‌లు సాధించారని ఆయన తెలిపారు. ర్యాంకులను సాధించిన విద్యార్థులను, వారికి గేట్ పరీక్షలో తర్ఫీదు ఇచ్చిన అధ్యాపకులను కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్ అభినందించారు.

## వైభవోపేతం.. పుష్పయాగం

నెల్లూరులో జరుగుతున్న శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 19వ తేది రాత్రి స్వామివారికి వైభవోపేతంగా పుష్పయాగం చేశారు. అనంతరం నయనానందకరంగా దవనోత్సవాన్ని నిర్వహించారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె. శ్రీనివాసరావు, ఆలయ ఇఓ ఆళ్ళ శ్రీనివాసులురెడ్డి, ఛైర్మెన్ మంచికంటి శ్రీనివాసులు పర్యవేక్షించారు.



## రాష్ట్రపతి విందులో.. ఎంపీ వేమిరెడ్డి

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల ఢిల్లీలో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో నెల్లూరు పార్లమెంటుసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) పాల్గొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ, హర్యానా మరియు ఉత్తరప్రదేశ్‌కి చెందిన పార్లమెంటు సభ్యులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, జగత్‌ప్రకాష్ నడ్డా, రామ్మోహన్‌నాయుడు, ఇతర ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి.. వేమిరెడ్డి తన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

### ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో..

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని నిరుపేదలు, బాధితులైన పలువురు లబ్దిదారులకు ఇటీవల రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. 20 మంది బాధితులకు 20 లక్షల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ ఎనిమిది నెలలలో ఒక్క నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో బాధితులకు సాయమందించేందుకు సుమారు 70 లక్షల రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధి క్రింద కేటాయించారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి వల్ల ఎందరో బాధితులకు మేలు జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, పలువురు జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు

# ప్లాస్టిక్‌తో అన్నీ అనర్థాలే!

## ఉదయగిరిని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదాం

--- ఎమ్మెల్యే కాకర్ల పిలుపు ---



ప్లాస్టిక్ వినియోగంతో అన్నీ అనర్థాలేనని, దాని వాడకం క్యాన్సర్ వ్యాధి వచ్చేందుకు కారణమవుతుందని, మరోవైపు పర్యావరణానికి హానికరమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చెప్పారు. ఇటీవల వింజమూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' నిర్వహించారు. వింజమూరు పంచాయతి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకర్ల మాట్లాడుతూ, ఉదయగిరి నియోజకవర్గాన్ని ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలను అందరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం దుకాణదారుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. తొలుత, ప్లాస్టిక్ వాడకం వద్దటూ స్థానిక హైస్కూల్ నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com